


నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

ములుగు

21 నుంచి 24 వరకు

మేడారం మహాజాతర

ఆదివారం | ఫిబ్రవరి 25, 2024 | www.navatelangana.com

తల్లులను దర్శించుకున్న ప్రముఖులు



నవతెలంగాణ-ములుగు

ధర్మపురి ఎమ్మెల్యే చీఫ్ విఫ్ వడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, హైకోర్టు జిల్లా జడ్జిలు హరిప్రియ, రేవతి, డిఐజి కే శ్రీనివాస్ రెడ్డి, తదితరులు అమ్మవారిని శనివారం దర్శించుకుని మొక్కులు సమర్పించారు.మహా కుంభమేళా మేడారం జాతరలో శనివారం నాడు భక్తులు అధిక సంఖ్యలో మొక్కులు చెల్లించుకున్నారు. ధర్మపురి ఎమ్మెల్యే చీఫ్ విఫ్ వడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, హైకోర్టు జిల్లా జడ్జిలు హరిప్రియ, రేవతి, డిఐజి కే శ్రీనివాస్ రెడ్డి, తదితరులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. అమ్మవార్ల వన ప్రవేశంతో ముగియనుంది. అందుకు జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.



జనం నుంచి వనంలోకి తల్లులు

భక్తుల కేరింతల మధ్య తల్లుల వనంలోకి చేరిక

తల్లుల వన ప్రవేశం సందర్భంగా భక్తుల కిటకిట

నవతెలంగాణ-ములుగు

జనం నుంచి వనంలోకి తల్లులు, భక్తుల కేరింతల మధ్య తల్లుల వనంలోకి చేరారు. తల్లుల వన ప్రవేశం సందర్భంగా భక్తులు కిటకిలాడారు. సారలమ్మ రాక తర్వాత మహాజాతర లాంఛనంగా ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఆ మరుసటి రోజు సమ్మక్కను గద్దెపైకి తీసుకురాగా.. శుక్రవారం నాడు అశేష భక్త జనం వన దేవతలకు మొక్కులు సమర్పించారు. భక్తులు పోటెత్తడంతో మేడారం జనజాతరను తలపించింది. భక్తులు జంపన్న వాగులో పుణ్య స్నానాలు చేసి.. బంగారం తులా భారం, మొక్కులు సమర్పించారు. శనివారం ఇద్దరు తల్లులు వన ప్రవేశం చేసారు. కన్నెపల్లికి సారలమ్మ, చిలకలగుట్టకు సమ్మక్కలు చేరుకోవడంతో జాతర ముగిసింది. జాతర నేపథ్యంలో.. భక్తిశ్రద్ధలతో వనదేవతలకు దేశం నలుమూలల నుండి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించారు. సమ్మక్క సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులను గద్దెలపై నుంచి ఆదివాసీ పూజారులు వారి వారి ఆలయాలకు తీసుకెళ్లారు. సమ్మక్క ప్రతిరూపమైన కుంకుమ భరిణెతో సాయంత్రం ప్రారంభమై సూర్యాస్తమయం తర్వాత పూజారులు రాత్రి 7.27 నిమిషాలకు వన ప్రవేశం చేయడంతో జాతర ముగిసింది.

మేడారంలో మళ్లీ ట్రాఫిక్ జామ్

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

మేడారం జాతరలో ట్రాఫిక్ నియంత్రణలో విఫలమైన అధికారులు శనివారం సైతం ఇదే సన్నివేశాలు పునరావృతం కావడం జాతరలో అధికారులు చేతులెత్తేశారా ? అన్న సందేహాలు వ్యక్తమయ్యాయి. మేడారం గద్దెల వద్ద కనీసమాత్రం శుభ్రం చేయకపోవడంతో మొక్కులు తీర్చుకోవడానికి వెళ్లిన భక్తులు జారుతున్న పరిస్థితి కడు దయనీయంగా కనిపించింది. ఈ విషయంలో భక్తులు సైతం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. వివిఐపి, విఐపి పాసులున్న వారిని సైతం పోలీసు అధికారులు తాడ్వాయి వైపు వెళ్లకుండా అడ్డుకొని పస్రా మీదుగా నార్లపూర్‌కు మళ్లించారు. దీంతో సుమారు 14-15 కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్ నిలిచిపోయి ప్రైవేటు వాహనాల్లో వచ్చిన ప్రజలు

అధికారులు చేతులెత్తేశారా..?

పని చేయని వీఐపీ, వీవీఐపీ పాసులు

తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. జాతరలో వరుసగా మూడు రోజుల పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడంతో భక్తులు అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

మేడారం మహాజాతర విజయవంతం కావాలంటే ప్రధానంగా ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలే అతిముఖ్యమైనవి. ఈసారి మేడారం మహాజాతరలో ట్రాఫిక్ రద్దీతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. జాతరలో కీలకమైన గురు, శుక్రవారాలతోపాటు శనివారం సైతం ట్రాఫిక్ రద్దీతో ప్రజలు గంటల తరబడి వాహనాల్లో చతికిలపడి కూర్చోవాల్సి వచ్చింది.



దీంతో అధికారులు ట్రాఫిక్ నియంత్రణకు ఏం చర్యలు తీసుకున్నారని భక్తులు ప్రశ్నించారు. ప్రైవేటు వాహనాలు వెళ్లే పస్రా-నార్లపూర్ మీదుగా మేడారం వెళ్తుండడం తెలిసిందే. వివిఐపి, విఐపి పాసులున్న వాహనదారులు నేరుగా తాడ్వాయి మీదుగా మేడారం గద్దెల సమీపంలో ఏర్పాటు చేసిన పార్కింగ్‌లో వాహనాలు పెట్టుకొని గద్దెలకు చేరాల్సి వుంది. శనివారం ఉదయం నుండి వివిఐపి, విఐపి పాసులున్న వాహనాలను సైతం పస్రా-నార్లపూర్ మీదుగా మళ్లించారు. పాసులున్నాయని చెబుతున్నా పోలీసు అధికారులు పట్టించుకోలేదని విమర్శించారు. ట్రాఫిక్ రద్దీతో సుమారు 2.00 నుండి 3.00 గంటల పాటు ప్రజలు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొన్నారు. దర్శనం వద్ద సైతం వివిఐపి, విఐపి పాసులను సైతం పోలీసు అధికారులు పట్టించుకోక పోవడం పట్ల భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

చేతులెత్తేశారా..?

వివిఐపి, విఐపి పాసులున్న వాహనదారులను తాడ్వాయి వైపు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసు అధికారులు వారిని పస్రా-నార్లపూర్ మీదుగా మళ్లించారు. దీంతో ప్రైవేటువాహనాలు, మరోవైపు వివిఐపి, విఐపి పాసులున్న వాహనదారులతో ఈ రహదారి కిటకిటలాడింది. ఒకవైపు మేడారం నుండి వచ్చే ప్రైవేటు వాహనాలు, మరోవైపు పస్రా నుండి మేడారానికి వెళ్లే ప్రైవేటు వాహనాలతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో గంటలతరబడి వాహనాల్లోనే ప్రజలు ఇరుక్కుపోయారు. దీంతో అధికారులను, ప్రజాప్రతినిధుల వ్యవహారశైలిపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

పారిశుధ్యం ఏదీ..?

గవర్నర్, సీఎం మొక్కులు సమర్పించి వెళ్లాక మన బాధ్యత అయిపోయిందని వ్యవహరించినట్లుగా అధికారులు వ్యవహరించారని పలువురు భక్తులు అసహనం వ్యక్తం చేశారు. శనివారం ఉదయం మేడారం గద్దెల వద్దకు వెళ్లిన భక్తులకు ఆ పరిసర ప్రాంతాల్లో బెల్లం తొలగించక పోవడంతో జారుతుండడాన్ని గమనించి జాగ్రత్తగా బయట పడ్డామని వాపోయారు. కనీసమాత్రం ఎప్పటికప్పుడు బెల్లాన్ని తొలగించి శుభ్రపరచడంలో అధికారులు అలసత్వాన్ని ప్రదర్శించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.





మహిళా అధికారుల నేతృత్వంలో

మేడారం జాతర విజయవంతం

నవతెలంగాణ- ములుగు

ప్రస్తుత 2024 మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు ఒక ప్రత్యేకత ఉంది. మాతస్వామ్య వ్యవస్థకు ప్రాధాన్యతను కల్పించే ఈ మేడారం జాతర నిర్వహణలో దాదాపు 90 శాతం నిర్వహణధికారులు మహిళలే కావడం యాదశ్చికం. జాతర ఏర్పాట్లను మొత్తం తన భుజాలపై వేసుకొని గత ఆరునెలల నుండి ప్రతిరోజూ స్వయంగా సమీక్షిస్తున్న రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ ఏ సీతక్క అత్యంత ప్రధాన పాత్ర పోషించారు. దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న కొండా సురేఖ కూడా, తాను, అస్వస్థులైనప్పటికీ తన శాఖ అధికారులతో సమీక్షిస్తూ పలుమార్లు మేడారాన్ని సందర్శించి జాతర ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

ఇక, ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి గత అనుభవం లేనప్పటికీ ప్రతీ సూక్ష్మ విషయంపై ప్రత్యేక శ్రద్ధ చూపించడం వల్ల ఈ మహా జాతర ఏవిధమైన ఇబ్బందులు లేకుండా కొనసాగిందని చెప్పవచ్చు.

2008 జాతర కూడా మహిళా అధికారుల నేతత్వం

అయితే, ప్రస్తుత జాతరతోపాటు, 2008 సంవత్సరంలో జరిగిన మేడారం జాతర కు ఇంతే, ప్రత్యేకత ఉంది. ఆ జాతరను విజయవంతంగా నిర్వహించిన అధికారులలో ముఖ్యమైన వారందరూ మహిళలు ఉండడం ప్రత్యేకత. ప్రధానంగా మాతస్వామ్య వ్యవస్థకు అత్యంత పాదాన్యత మన దేశంలో గిరిజన తెగల్లో ఉంది. మాతస్వామ్య వ్యవస్థలో భాగంగానే మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను పరిగణించాలి.

2008 లో జాతర నిర్వహణా బాధ్యతలో పాలుపంచుకున్నవారిలో జిల్లా కలెక్టర్ నేతత్వంలో అందరూ మహిళా అధికారులే ఉండడం గమనార్హం. జిల్లా కలెక్టర్ దమయంతి, పోలీస్ సూపరింటెండెంట్ సౌమ్య మిశ్రా, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ధన్వంతి, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, మహిళా శిశు సంక్షేమ శాకాధికారి, జిల్లా పంచాయితీ అధికారి పద్మజారాణి ఇలా అనేక శాఖలకు మహిళా అధికారులే ఉన్నారు. వీరందరి నేతత్వంలో జాతర విజయవంతంగా ఏవిధమైన సంఘటనలు లేకుండా నిర్వహించారు. అప్పుడు, తాడ్వాయి మండల పరిషద్ అధ్యక్షులుగా కూడా సమ్మక్క అనేమహిళనే ఉంది.

వీరితోపాటు మరెందరో మహిళా అధికారులు ఆ 2008 జాతరలో విశేష సేవలందించారు. అందుకే , ఆ జాతరను ప్రత్యేక జాతరగా పేర్కొనవచ్చు.

జాతరను విజయవంతం చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు

2024 మేడారం జాతర మొత్తం మహిళల నేతృత్వంలోనే పకడ్బందీగా జరగడం విశేషంగా చెప్పుకోవచ్చు. ఈ జాతరలో మహిళా ప్రజా ప్రతినిధులు, అధికారుల వివరాలు.

రాష్ట్ర గిరిజన, పంచాయితీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, మహబూబ్ బాద్ పార్లమెంటు సభ్యురాలు మాలోతు కవిత, జిల్లా పరిషత్ చైర్మన్, ములుగు జిల్లా బడే నాగ జ్యోతి, ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ చిత్రా మొహ్రా, ములుగు అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ, హన్మకొండ అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తా, అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా,జిల్లా సంక్షేమ అధికారి లేనీనా,పీఆర్ఓ బండి పల్లవి, పీఆర్ఓ ఈవీ కిరణ్మయి, గిరిజన సంక్షేమ శాఖ కార్య నిర్వాహక ఇంజనీరు హేమలత, ఉష, వీరంతా సమ్మక్క సారక్క వారసులు గా జాతరను విజయవంతం చేశారు.

మేడారంలో విద్యుత్ శాఖ సేవలు ప్రశంసనీయం

నిర్విరామ కృషికిగాను అధికారుల అభినందన

నవతెలంగాణ -తాడ్వాయి

మేడారం నట్టడివిలో జరిగే మహాజాతరలోవనదేవతలను దర్శించుకనేందుకు సుమారుగా కోటిన్నరకుపైగా భక్తులు తరలివస్తారు. రెండేళ్లకోసారి మాత్రమే మహానగరాన్ని తలపించే మేడారంలో విద్యుత్తు కాంతులే కీలకం.కొద్దిసేపు అక్కడ కరెంట్ స్తంభించిపోతే అక్కడి వ్యవస్థే అతలాకుతలమవుతుంది. అందుకే తెలంగాణ స్టేట్ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(టీఎస్ ఎన్పీడీసీఎల్) ఏర్పాట్లలో నిమగ్నమై, సకాలంలో నాణ్యతతో కూడిన విద్యుత్‌ను నిరంతరం సరాఫరా చేస్తూ జాతర విజయవంతంలో భాగస్వామ్యం పంచుకుంది. జాతరలో వెలుగు కాంతుల పట్ల సందర్శకులు హర్షం వ్యక్తం చేస్తూ విద్యుత్ శాఖను ప్రశంసించారు.

జాతరలో విద్యుత్ సంబంధించి ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా అన్ని చర్యలు చేపట్టారు. నిరంతర సరఫరాను పర్యవేక్షించేందుకు దాదాపు 500 మంది విద్యుత్తుశాఖ సిబ్బంది విధులు నిర్వర్తించి ఒక్క నిమిషం కూడా కరెంటు పోకుండా మహా జాతరను సక్సెస్ చేశారు. ఇందులో ప్రధానంగా 75 మంది వరకు ఏడీఈలు, ఏఈలు, సబ్ ఇంజినీర్లు, 350 మంది వరకు ఆపరేటింగ్ స్టాఫ్,



వారిపైనా డిఈ లు, ఎస్ఈలు, డైరెక్టర్లు, సీజీఎంలు నిరంతరం పర్యవేక్షణ నిర్వహించారు. అంతరాయం లేకుండా విద్యుత్తుశాఖ అధికారులు నిర్విరామ కృషి చేసి జాతరను విజయవంతం చేసినందుకు ఉన్నతాధికారులు విద్యుత్ శాఖ అధికారులను అభినందించారు.

మేడారంలో మెరుగైన వైద్య సేవలే లక్ష్యంగా ఆయుష్ కృషి

వరంగల్ ప్రాంతీయ ఉపసంచాలకులు డాక్టర్ బి రవి నాయక్

నవతెలంగాణ-ములుగు

సమ్మక్క సారలమ్మ జాతరలో భక్తులకు ఉచిత సేవలు అందించడమే లక్ష్యంగా జాతర ప్రారంభమైన మొదటి నుండి చివరి వరకు మొత్తం ఆరు రోజుల పాటు తెలంగాణ ప్రభుత్వం ఆయుష్ వైద్య ఆరోగ్యశాఖ ద్వారా మెడికల్ మెగా శిబిరం టీటీడీ కళ్యాణ మండపం ఆవరణలో ఉచితంగా ఆయుర్వేద హోమియో, యునాని వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్టు ప్రాంతీయ ఉపసంచాలకులు వరంగల్ డాక్టర్ బి రవినాయక్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

ఎం ప్రశాంతి ఐఏఎస్ డైరెక్టర్ ఆయుష్ హైదరాబాద్ ఆదేశాలతో జాతరలో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ప్రజారోగ్య రక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఇంగ్లీష్ వైద్యం కన్నా యునాని హోమియోపతి వైద్యంతో ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని సందర్శకులకు అవగాహన కల్పించినట్టు తెలిపారు. జాతరలో ఆరు రోజులుగా ఆయుర్వేద నుండి 1350, హోమియో నుండి 1450 యునాని నుండి 1250 మందికి చికిత్స ఇచ్చి ఉచితంగా



మందులు పంపిణీ చేశామన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ వి నిరంజన్, మహేందర్, ఎస్‌హెచ్ఓలు రామకష్ణ, రాజేందర్‌రావు, సంజీవ్‌కుమార్, కుమారస్వామి, సత్యం, మంజుల, 50 మంది వైద్యాధికారులు, మెగా మెడికల్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన మహా జాతర

తిరుగు ప్రయాణమైన భక్తులు

నవతెలంగాణ-ములుగు

ఆసియాలోనే అతిపెద్ద జాతరగా పేరు గాంచిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతర కు దేశం నలు మూలల నుండి భక్తులు పోటెత్తి వచ్చారు.నాలుగు రోజులుగా మేడారం పరిసర ప్రాంతాలు అమ్మవార్ల దర్శనానికి వచ్చిన భక్తులతో కిట కిట లాడాయి. అయితే నేడు సమ్మక్క,సారలమ్మ అమ్మవార్ల వనప్రవేశం జరుగుతున్న నేపథ్యంలో అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులు తిరిగి వారి వారి స్వగ్రామాలకు తరలి వెళ్తున్నారు. భక్తుల తిరుగు ప్రయాణం సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలోని క్యూ లైన్లు నిండిపోయాయి.ఇప్పటి వరకు దాదాపు పదివేల ట్రిప్పుల బస్సులు నడిచినట్లు



అధికారులు తెలిపారు.భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన గుడారాలు, టెంట్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. తమ సామగ్రినీ, పిల్లలను చేతిలో పట్టుకొని తిరుగు ప్రయాణం సాగిస్తున్నారు.

నవతెలంగాణ
వరంగల్
ఆదివారం ఫిబ్రవరి 25, 2024 www.navatelangana.com
2

పురపాలక సంఘాల్లో పారిశుధ్య కార్మికులకు వెంటనే వేతనాలు పెంచాలి



- సీఐటీయూ జిల్లా కోశాధికారి సింగారం బాబు

నవతెలంగాణ-వరంగల్

వరంగల్ మహా నగర పాలక సంస్థ లో విధులు నిర్వర్తిస్తున్న పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి సింగారం బాబు అన్నారు. జీడబ్ల్యుఎంసీ ప్రధాన కార్యాలయంలో అదన కమిషనర్ రషీద్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు అనంతరం బాబు మాట్లాడుతూ తెలంగాణ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్ వారి ద్వారా మెమో నెంబర్ 6603 ఈజీ (1) 2023-3, 2 ఫిబ్రవరి 2024న ఎంఏ, యూడీ మున్సిపల్ డిపార్ట్మెంట్ వారు ప్రస్తుతం ఉన్న వేతనాలపై రూ.1వేయి పెంపుదల చేస్తూ జీహెచ్ఎం సీ, హెచ్ఎండబ్ల్యూయూ ఎస్ఎస్‌బీతో సహా రాష్ట్రంలో అన్ని యూఎల్‌బీల పారిశుధ్య, బహుళార్ధ సాధక కార్మికులు పారిశుధ్య కార్మికులకు వేతనం పెంచుతూ నిర్ణయం చేసిందన్నారు. వరంగల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఇతర భాగాల్లో ఉద్యోగ కార్మి కులకు కూడా వేతన పెంపుదల విషయమై పరిశీలించి కార్మికులందరికీ న్యాయం చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్ను ప్రకాష్, అనుబంధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల



నవతెలంగాణ-సుబేదారి

ఎమ్మెల్సీ ఓటర్ల ముసాయిదా జాబితాను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జీ శనివారం విడుదల చేశారు. జిల్లా కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి ఈ ఓటర్ల ముసాయిదా జాబితా, సీడీలను పార్టీల ప్రతినిధులకు అందజేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మహేందర్ జీ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్, ఖమ్మం,నల్గొండ గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గ ఓటర్ల ముసాయిదా జాబితాను తహశీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో ప్రదర్శించినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే నేటి నుండి మార్చి 14 వరకు సంబంధిత ఏఈఆర్‌ఓలకు అందజేయాలన్నారు. అభ్యంతరాలను మార్చి 29వరకు పరిశీలించి ఏప్రిల్ 4న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని 11 మండలాల పరిధిలో 99 పోలింగ్ స్టేషన్లను గుర్తించినట్లు, అదేవిధంగా ఇప్పటి వరకు 39వేల 167 మంది పట్టభద్రులు ఓటు నమోదు చేసుకున్న ట్లు తెలిపారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు నే హాల్, రజినీకాంత్, మణి, లక్ష్మణ్, జైపాల్‌రెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ప్రసాదరావు, నాయబ్ తహశీల్దార్ రామకృష్ణ, అన్వేష్‌లు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

నవతెలంగాణ-సుబేదారి

తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ అధ్యయన కేంద్రం వరంగల్ జిల్లా (ఉమ్మడి)శాఖ 5 మాసాల ఉచితశిక్షణకు మార్చి6 లో పు దరఖాస్తు చేసుకోవాలని హనుమకొండ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి నిర్మల తెలిపారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో గల డిగ్రీ పూర్తి చేసిన ఎస్సీ, ఎస్టీ ,బి.సి నిరుద్యోగులు రాష్ట్ర ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ ద్వారా 5మాసాల పాటు వివిధ ఉద్యోగాలకు నిర్వహించే పోటీ పరీక్షలకు హన్మకొండలో గల షెడ్యూల్డ్ క్యాస్ట్ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకొనుటకు **www.tsstudycircle.co.in** వెబ్‌సైట్‌లో వార్షిక ఆదాయం రూ.3 లక్షల వరకు ఉన్నటువంటి వారు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. అర్హులైన వారికి మార్చి10న తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ క్యాస్ట్ స్టడీ సర్కిల్ హైదరాబాద్ వారిచే యూనివర్సిటీ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో ఉదయం 11 గంటల నుండి 1గంట వరకు పరీక్ష నిర్వహించబడుతుంది. ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు మార్చి 18 నుంచి ఆగస్టు 17 వరకు ఆర్‌టిసికాలనీ వడ్డేపల్లి, హన్మకొండ నందు గల స్టడీ సర్కిల్ లో తరగతులు నిర్వహించబడుతాయి. శిక్షణా కాలములో రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలతోపాటు, ఆర్‌ఆర్‌బి, బ్యాంకింగ్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ వంటి ఉద్యోగాల పోటీ పరీక్షలకు భోజన, వసతితో కూడిన ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. ఇంతకు ముందు ఏదేని ప్రభుత్వ సంక్షేమ శాఖ ద్వారా శిక్షణ పొందిన వారు అనర్హులు. పూర్తి వివరములకు **www.tsstudycircle.co.in** లో సంప్రదించాలని కోరారు.

26న త్రిపుర గవర్నర్‌కు ఆత్మీయ పౌర సన్మానం



నవతెలంగాణ-హన్మకొండ

ఈనెల 26న సోమవారం ఓరుగల్లు సిటిజన్స్ ఫారం ఆధ్వర్యంలో త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డికి హనుమకొండ హంటర్ రోడ్‌లోని డి కన్వెన్షన్ హాల్లో ఆత్మీయ పౌర సన్మానం జరుగుతుందని ఓరుగల్లు సిటిజన్స్ ఫోరం అధ్యక్షులు సమ్మిరెడ్డి తెలిపారు. శనివారం వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీకి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజా సమస్యలపై తమ గళం వినిపించడంతోపాటు చేసిన ప్రజా సేవలను గుర్తించిన కేంద్రం త్రిపుర గవర్నర్‌గా నియమించారన్నారు. బం ధుమిత్రులు ఏర్పాటు చేసిన సన్మానాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బూర రామచందర్, కంది శ్రీనివాస్‌రెడ్డి, పెండ్లి ఉపేందర్‌రెడ్డి, పులి సరోత్తంరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన పూజారి రాజక్కకు సన్మానం



నవతెలంగాణ-శాయంపేట

మండలంలోని పెద్దకోడపాక రెవెన్యూ శివారులోని జోగంపల్లి మినీ సమ్మక్క, సారలమ్మ జాతర ప్రారంభమైన నాటి నుండి మేడారం గిరిజన పూజారి రాజక్కతో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. జాతరకు రెండు రోజుల ముందుగా పూజారి రాజక్కను మేడారం నుండి తీసుకొని వచ్చి శుద్ధి కార్యక్రమాలను నిర్వహించడం, గిరిజన సాంప్రదాయ పద్ధతిలో సమ్మక్క, సారలమ్మ, పడిగిద్దెరాజులకు ప్రత్యేక పూజలు నిర్వహించి అలంకరణ చేయడం, గద్దెలపైకి తీసుకురావడం, జాతర ముగిసాక ప్రత్యేక పూజలు నిర్వహించి తిరిగి వన ప్రవేశం చేయించడం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. జాతర పూర్తి అయ్యాక చీరే సారే తోపాటు నగదు పారితోషికం అందించి మేడారం కు సాగనంపుతామని జాతర ఉత్సవ కమిటీ చైర్మన్, మాజీ సర్పంచ్ అబ్బు ప్రకాష్ రెడ్డి తెలిపారు.

కోరిన కోరికలు తీర్చే లక్ష్మీనరసింహ స్వామి



నవతెలంగాణ-గీసుకొండ

కోరిన కోరికలు తీర్చే లక్ష్మి నరసింహస్వామిని మంచి మనసుతో కోరుకుంటే కోరికలు నెరవేరుతాయని కాంగ్రెస్ జిల్లా నాయకులు అల్లం బాలకిషోర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎలుకుర్తి హవేలి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవంలో పాల్గొని స్వామివారికి రూ. 75వేల విలువగల శఠగోపం అల్లం బాలకిషోర్ రెడ్డి దంపతులు బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లవేళలా నరసింహస్వామి ఆశీస్సులు ప్రజలకు వుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భీమగాని సౌజన్య, కాంగ్రెస్ నాయకులు అల్లం మర్రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు తుమ్మనపెల్లి శ్రీనివాస్, కొమ్ము శ్రీకాంత్, కందికొండ రాజు, మాదాసి రాంబాబు, అనిల్, కనకయ్య రాజమౌళి, సాంబయ్య, మహేందర్ రాజు, మల్లేష్, చేరాలు, బొందాలు కుమార్, రాజు, కమలాకర్, ఎలుకుర్తి, నల్ల సురేష్ బాబు,తిప్పారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు





నవతెలంగాణ-సుబేదారి

హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఫిజిక్స్ విభాగంలో సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ జితేందర్, డాక్టర్ ప్రవీణ్ లు ఈనెల 25 నుండి 28వ తేదీ వరకు మహారాష్ట్రలోని పూణే ప్రాంతంలో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ పౌడర్ మీటర్లజి, పెర్కులేట్ మెటీరియల్స్-2024 సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు కళాశాల ఫిజిక్స్ విభాగం ఇద్దరు అధ్యాపకులు పాల్గొంటున్నట్లు ప్రిన్సిపాల్ ఆచార్య బన్న ఐలయ్య తెలిపారు. వీరు ఈ సదస్సులో 'ఐ ఎనర్జీ బల్మిల్డ్ మెటల్ నానో ప్రాక్టికల్ ఆఫ్కోబాలేట్ వైఎక్స్ రే స్టడీ' అనే అంశంపై సంయుక్త పేపర్ను ప్రజెంటేషన్ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అంతర్జాతీయ సదస్సులో పాల్గొంటున్న ఇద్దరు అధ్యాపకులను కళాశాల అధ్యాపకులు తదితరులు అభినందించారు.

దేశ అభివృద్ధిలో సీఏల పాత్ర కీలకం : ఎమ్మెల్యే నాయిని



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

సొంత ఆలోచనలతో తామకు తాముగా భవిష్యత్తుపై రూపకల్పన చేసుకుని ఆదిశగా సాధనచేస్తే మంచి ఫలితాలు పొందవచ్చని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిఅన్నారు. కాకతీయ యూనివర్సిటీ రోడ్డులోని రిలయన్స్ డిజిటల్ కాంప్లెక్స్ థర్డ్ ఫ్లోర్‌లో శృతి అండ్ కో చార్టెడ్ అకౌంట్ శనివారం జ్యోతి ప్రజలను చేసి ప్రారంభంచేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో అన్నిరంగాల్లో శాస్త్రసాంకేతిక పరంగా దూసుకెళుతుందని దానికిఅనుగుణంగా ప్రణాళికలు చేసుకోవాలన్నారు. శృతి చార్టెడ్ అకౌంట్ నిర్వాహకులు కందకట్ల నరేంద్ర, కందకట్ల రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే భవిష్యత్తుపై ప్రణాళిక సిద్ధం చేసుకుని తక్కువ సమయంలో ఎక్కువగా ఆర్థికంగా ఎదగడానికి సాధన చేయాలని, చార్టర్ అకౌంట్ విద్యనభ్యసించి దానిలోని మెలకువలను పాటించి చార్టెడ్ అకౌంట్ గా రాణించి ఉన్నతశ్రేణి గా భవిష్యత్తులో మంచి స్థానాన్ని కైవసం చేసుకొని తోటి వారికి ఆదర్శంగా నిలువాలని ఆకాంక్షించారు. భారతదేశంలో సీఏల సంఖ్య అతి తక్కువ కనిష్టస్థాయిలో ఉన్నప్పటికీ భారత ప్రభుత్వం ఏటా నిర్వహించే ప్రవేశ పరీక్షల్లో పోటీ తత్వం పెరిగిందని గణాంకాలలో వెల్లువైనట్లు వారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బిజెపి హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, ఐసిఎఐ వరంగల్ బ్రాంచ్ చైర్మన్ రాయబారపు హరికృష్ణ జిల్లా పరిషత్ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలురావు పద్మ, చార్టెడ్ అకౌంటెంట్ శశి,కందకట్ల నరేంద్ర, కందకట్ల రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

జనం నుండి వనంలోకి సమ్మక్క, సారలమ్మలు





నవతెలంగాణ-శాయంపేట

గత మూడు రోజులుగా పూజలు అందుకున్న వన దేవతలైన సమ్మక్క, సారలమ్మ, పడిగిద్దే రాజులు గద్దెలపై నుండి తిరిగి వన ప్రవేశం చేయడంతో జాతర ఉత్సవాలు శనివారం రాత్రి ముగిసాయి. మండలంలోని పెద్దకోడపాక రెవెన్యూ శివారులోని జోగంపల్లి గ్రామంలో ఈనెల 21 నుండి మినీ సమ్మక్క సారలమ్మ జాతర ప్రారంభమైంది. తల్లులు గద్దెపై కొలువు తీరడంతో శనివారం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సందర్శించి తల్లులకు నిలువెత్తు బంగారం, మొక్కలు చెల్లించుకున్నారు. తహసిల్దార్ సుభాషిని సందర్శించి జాతరను పర్యవేక్షించారు. శనివారం రాత్రి సమ్మక్క, సారలమ్మ, పడిగిద్దెరాజును మేడారం నుండి వచ్చిన పూజారి రాజక్క ప్రత్యేక పూజలు నిర్వహించి తిరిగి గద్దెలపై నుండి వన ప్రవేశం చేయడంతో జాతర ముగిసినట్లు జాతర ఉత్సవ కమిటీ చైర్మన్, మాజీ సర్పంచ్ అబ్బు ప్రకాష్ రెడ్డి తెలిపారు. జాతర ప్రశాంత వాతావరణంలో జరగడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. జాతర అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ పాలకవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : అగ్రంపహాడ్ సమ్మక్క సారలమ్మ లు జనంలో మూడు రోజుల పాటు పూజలు అందుకొని జనము నుండి వనం లోకి వెళ్లారు. దీంతో జాతర మహాఘట్టం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా పూజారులు బలి హరణ చేసి అమ్మవార్లను గద్దలనుండి తరలించారు. హుండీ లను కదిలించి జాతరను ముగింపు పలికారు. ఈ సందర్భంగా జాతర ప్రత్యేక అధికారి ఆర్డీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వనప్రవేశం ఘనంగా నిర్వహించారు. శనివారం జాతరలో భక్తుల తాకిడి జోరుగా సాగింది. అమ్మవారిని దర్శించు కనేందుకు భక్తులు క్యూలైన్ల లో బారులుతీరారు.దీంతో జాతర ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. జాతర కమిటీ సభ్యుల, ఆయా శాఖల అధికారుల, భక్తుల, నాయకుల మీడియా మిత్రుల సహకారంతో జాతర విజయవంతం చేశామని ఈ సందర్భంగా వారందరికీ ఇఓ శేషగిరి ధన్యవాదాలు తెలిపారు.

జాతర సజావుగా భక్తులకు ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ఈవో శేషగిరిరావు, ఏసిపి కిషోర్ కుమార్, సిఐ సంతోష్, పిఏసీఎస్ మాజీ చైర్మన్ బీరం సుధాకర్‌రెడ్డి, జాతర చైర్మన్ శీలం రమేష్‌యాదవ్, మాజీ ఏఎంసీ చైర్మన్ బోరిగం స్వామి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్, జాతర డైరెక్టర్లు ప్రత్యేకంగా చర్యలు తీసుకున్నారు.

సైన్స్ టాలెంట్ పోటీల్లో నలుగురు విద్యార్థులు



నవతెలంగాణ-వరంగల్

రాష్ట్రస్థాయి సైన్స్ టాలెంట్ పోటీల్లో వరంగల్ జిల్లా నుండి నలుగురు విద్యార్థులు పాల్గొన్నారని డీఈవో వాసంతి అన్నారు. వరంగల్ జిల్లా కష్ణా కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఫిజిక్స్, బయాలజీ టీచర్ల ఫోరం వరంగల్ జిల్లా శాఖ రాష్ట్రస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. జిల్లా పోటీలలో ఉత్తమ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు శనివారం రాష్ట్ర స్థాయిలో పాల్గొ న్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ పూర్తిగా ఆన్లైన్ పద్ధతి లో స్మార్ట్ ఫోన్ల ద్వారా జరిగిన ఈ ప్రతిభా పరీక్షను రాష్ట్ర ఫిజిక్స్, బయాలజీ టీచర్స్ ఫోరమ్స్ ఏకకాలంలో అన్ని జిల్లాల్లో నిర్వహించారన్నారు. ఈ పరీక్షలో 8వ తరగతి విభాగంలో ఖానాపూర్ మండలం అశోక్ నగర్ జెడ్పీ పాఠశాల విద్యార్థి బి. గౌతం, 9వ తరగతి విభాగంలో కష్ణాకాలనీ ప్రభుత్వ పాఠశాలకు చెందిన బి. విష్ణువర్ధన్ సింగ్, సిరిచందన టీఎస్‌ఆర్ఎస్ నెక్కొండ, తేజశ్రీ మోడల్ స్కూల్ వంచనగిరి పోటీలో పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమం హెచ్ఎం గంప అశోక్‌కుమార్, సైన్స్‌ఫోరమ్ బాధ్యులు కుందూరు సందీప్ కుమార్, చల్ల కష్ణా రెడ్డి, ఇనుగాల కవిత, గోగుల దయాకర్‌రెడ్డి, వోడపల్లి మమతలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మణికంఠకాలనీ వాసులు



నవతెలంగాణ-కాశిబుగ్గ

గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ పరిధిలోని మణికంఠ కాలనీ వాసులు శనివారం ఎమ్మెల్యే నాగరాజును ఆయన నివాసంలో మర్యాదపూ ర్వకం గా కలిసి కాలనీలో నెలకొన్న సమస్యల ను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కాలనీలో సరైన రోడ్లు డ్రైనేజీ లేకపోవడంతో పడుతున్న ఇబ్బందులను వివరించారు. వారి సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజును శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మణికంఠ కాలనీ కాంగ్రెస్‌అధ్యక్షుడు కంచ శ్రీనివాస్, కాలనీ డెవలప్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీఎస్ఐ చర్చి శతజయంతి ఉత్సవాలు



నవతెలంగాణ-పరకాల

పట్టణంలోని సి ఎస్ ఐ కాలనీలో సిఎస్ఐ చర్చి ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తి కావడంతో సి ఎస్ ఐ చర్చి శత జయంతి ఉత్సవాలు భారీ ర్యాలీని శనివారం పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ అధ్యక్ష మండలం రూబెన్ మార్క్ బిషప్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల చర్చి పాస్టర్లు స్థానిక బస్టాండ్ కూడలి నుండి అంబేద్కర్ సెంటర్ మీదుగా డీజేసౌండ్ సిస్టంతో భారీ ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా పరకాల పట్టణంలో సిఎస్ఐ చర్చి స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి కావడంతో నూతనంగా మరో చర్చిని ఏర్పాటు చేసి సంఘ పెద్దలతో ఎన్నో సమాజసేవ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు భారీ ర్యాలీని నిర్వహిస్తూ సంతోషాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుండి పాస్టర్లు, మైత్రి, యూత్, చిన్నపిల్లలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొమ్మకంటి చంద్రమౌళి ,తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన



నవతెలంగాణ-శాయంపేట

మండలంలోని కొప్పుల గ్రామం నుండి పరకాల వరకు నిర్మించబోయే బీటీ రోడ్డు నిర్మాణంతో రైతులకు, ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని కొప్పుల నుండి పరకాల వరకు నిర్మించబోయే బీటీ రోడ్డు పనులను శనివారం ఎమ్మెల్యే జిఎస్‌ఆర్ పాల్గొని పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్‌టిఎస్‌డిఎఫ్ నుండి మంజూరైన రూ.7 కోట్ల నిధులతో బీటి రోడ్డు పనులను ప్రారంభించినట్లు తెలిపారు. అతి త్వరలో బీటీ రోడ్డు పనులను పూర్తిచేసి ప్రజలకు, రైతులకు మెరుగైన సౌకర్యం కల్పించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి, మాజీ జెడ్పిటిసి చల్లా చక్రపాణి, పరకాల ఏఎంసీ మాజీ చైర్మన్ పోలపల్లి శ్రీనివాసరెడ్డి, నాయకులు ఏరుకొండ శంకర్, రమేష్,రవి, రాంరెడ్డి, తిరుపతిరెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక చేయూత

నవతెలంగాణ-ఆత్మకూరు

ఆత్మకూరు మండలం హౌజుబుజుర్గులో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సయ్యద్ ఇమామ్, మండల కేంద్రానికి చెందిన చింత పట్ల సమ్మయ్య కుటుంబాలను పీఏసిఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్ శనివారం పరామర్శించారు. అనంతరం రెండు కుటుంబాలకు రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ మండల అధ్యక్షుడు ఎండి ఖాజా, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికరాల వాసు, రేవూరి జైపాల్‌రెడ్డి, ఉప్పుల సుదర్శన్, అలువాల రవి, షేక్ ఖాసిం, ఇఫ్తాకార్, కరీం తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్‌నిర్మాణానికి రూ.12 లక్షలు మంజూరు

నవతెలంగాణ-దామెర

మండలం ఒగ్లాపూర్‌లోని ఈరాయి చెరువుగుట్టపై గల కాకతీయుల కాలం నాటి శ్రీవైకుంఠ వెంకటేశ్వరస్వామి దేవస్థాన పునర్నిర్మాణం కోసం దేవాదాయ శాఖ నుండి రూ.12 లక్షలు మంజూరైనట్లు రిటైర్డ్ ఉపాధ్యాయుడు సింగిల్ ట్రస్ట్ మెంబర్ పోరండ్ల ప్రభాకర్ తెలిపారు.

పట్టపగలే దొంగతనం

నవతెలంగాణ-నల్లబెల్లి

పట్టపగలే ఇంటివద్ద ఎవరూ లేని సమయంలో ఇంటి తాళం పగలకొట్టి ఇంటిలోకి చొరబడి బంగారు, వెండి ఆభరణాల చోరీ చేసిన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. మండల కేంద్రానికి చెందిన కుస కరుణాకర్ శుక్రవారం మద్ది మేడారం జాతరకు కుటుంబ సభ్యులతో వెళ్లి సాయంత్రం రాగా ఇంటి తలుపులు పగలగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా టేబుల్, బీరువాలు పగలగొట్టి ఉన్నాయి. దీంతో వెంట నే స్థానిక పోలీస్ స్టేషన్లో రూ.80 వేల విలువైన బంగారు, వెండి ఆభరణాలు గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి దొంగతనానికి పాల్పడినట్లు ఫిర్యా దు చేయగా వెంటనే సిఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నగేష్ తెలిపారు.

ఆర్‌డిఎఫ్‌కు నేడు ఇన్ఫర్ అధికారుల రాక

పర్వతగిరి : మండలంలోని రోళ్ళకల్ ఆర్‌డిఎఫ్ హై స్కూల్ ను సందర్శించడానికి నేడు ఇన్ఫర్ ఆఫీస్ తరుపున 10మంది ఇతర దేశాలకు చెందిన అధికారులు, ఇన్ఫర్ హైదరాబాద్ నుండి 20 మంది వస్తున్నట్లు ప్రిన్సిపాల్ బాషబోయిన రాములు శనివారం తెలిపారు.

వన దేవతలను దర్శించుకున్న అదనపు కలెక్టర్



నవతెలంగాణ-ఆత్మకూర్

మినీ మేడారంగా ప్రసిద్ధి గాంచిన అగ్రంపహాడ్ సమ్మక్క, సారలమ్మ జాతరను వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యారాణి దంపతులు వనదేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సందర్భంగా ఆమె వెంట తాసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి, సిఐ సంతోష్, ఈవో శేషగిరి జాతర చైర్మన్,శీలం రమేష్‌యాదవ్, ఏఎంసీ మాజీ చైర్మన్ బోరిగంస్వామిలు పాల్గొన్నారు.

జర్నలిస్ట్‌పై దాడి దుర్మార్గమైన చర్య

నవతెలంగాణ-నర్సంపేట

హైదరాబాద్ ఎల్బీనగర్‌లో తెలంగాణం దిన పత్రిక సీఈఓ, ఎడిటర్ శంకర్‌గౌడ్‌పై దుండగులు దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర అధ్యక్షులు అనంతుల రమేష్ గౌడ్ అన్నారు. శనివారం ఈ దాడిని ఖండిస్తూ మాట్లాడారు. సమాజానికి నిజాలు చెబుతున్న జర్నలిస్టు లపై భౌతిక దాడులకు పాల్పడడం అమానుషమన్నారు. తన కలం ద్వార అవినీతిని ప్రజలకు, ప్రభుత్వానికి తెలియచేస్తున్నాడనే కక్షతో కొందరు రౌడీలు దాడి చేసి కొట్టడం దారుణమన్నారు. నిష్పక్షపాతంగా వార్తలు రాసే వారిపై దాడులు చేయడంవంటి చర్యలు పత్రికా స్వేచ్ఛను హరించడమే అవుతుందని అన్నారు. జర్నలిస్ట్ శంకర్ గౌడ్‌పై దాడులకు పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని, జర్నలిస్ట్ లకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు. కొందరు దుండగుల దాడికి గురైన శంకర్‌గౌడ్‌కు న్యాయం చేసే వరకు సంఘం అండగా ఉంటుందని రమేష్ గౌడ్ తెలిపారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తులు

నవతెలంగాణ-సుబేదారి/వరంగల్

2024-25 సంవత్సరానికి హన్మకొండ, వరంగల్ జిల్లాల్లోని ఎస్సీ బాలబాలికల నుండి హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్ బేగంపేట్/ రామాంతపూర్‌లలో 1వ తరగతి (డే-స్కాలర్) ప్రవేశం కొరకు దరఖాస్తులు కోరుతున్నట్లు హన్మకొండ, వరంగల్ జిల్లాల షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారులు నిర్మల, భాగ్యలక్ష్మిలు శనివారం వేరేవేరుగా పత్రికా ప్రకటనల్లో తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 2017 జూన్ 1 నుండి 2018 మే 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. దరఖాస్తులు హన్మకొండ అంబేద్కర్ భవన్, గోకుల్ నగర్, సహాయ షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి కార్యాలయం, ఎస్సీబాలుర వసతి గృహం హసన్‌పర్తి ఏఎస్‌డబ్ల్యుఓ కార్యాలయంలో ఈ నెల25 నుంచి పొందాలని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను మార్చి 12 సాయంత్రం 4.30 గంటల వరకు సంబంధిత కార్యాలయంలో సమర్పించాలన్నారు. మీ సేవాలో పొందిన జనన, కుల, ఆదాయ, నివాస ధవీకరణ పత్రము, రేషన్ కార్డు, ఆధార్‌కార్డ్, ప్రస్తుత పాస్‌పోర్ట్ ఫోటో, మొబైల్ నెంబర్, కలిగి ఆదాయం గ్రామీణ ప్రాంతం వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతం వారికి రూ.2 లక్షలు ఉంటే అర్హులన్నారు. ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. వరంగల్ జిల్లా విద్యార్థులు డీఎస్‌డబ్ల్యుఓ కార్యాలయం వరంగల్, ఏఎస్‌డబ్ల్యుఓ కార్యాలయం నర్సంపేట నుండి పొందాలని మరింత సమాచారం కొరకు ఎస్.వెంకటొరెడ్డి, ఏఎస్ డబ్ల్యుఓ 97047 35235 ఈ నెంబర్ ని సంప్రదించాలన్నారు.

ఈనెల 26న జాబ్ మేళా

నవతెలంగాణ-వరంగల్

ఈనెల 26న సోమవారం ములుగు రోడ్ ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్ ఆవరణలో జిల్లా ఉపాధి కార్యాలయంనందు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా ఉపాధి అధికారి మాధవి పేర్కొన్నారు. ధ్రువంత్ సొల్యూషన్స్ కంపెనీలో టెలికాలింగ్ హైదరాబాద్, వరంగల్‌లలో పని చేయుటకు 70 ఉద్యోగాలు ఎంపికకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. 18 నుండి 28 ఏళ్లలోపు ఉన్న ఇంటర్, డిగ్రీ, పీజీ ఆపైన చదివిన అభ్యర్థులు అభ్యర్థులు ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేయ బడతారని, అర్హత, ఆసక్తిగల వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు విద్యార్హతలు సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో ఉపాధి కార్యాలయం జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 11గంటలకు హాజరు కావలసిందిగా కోరారు. వివరాలకు 8978493699 సంప్రదించాలన్నారు.

కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయండి

నవతెలంగాణ-ధర్మసాగర్

మార్చి 3, 4 తేదీలలో రెండు రోజుల పాటు హనుమకొండలో జరిగే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల ను జయప్రదం చేయాలని బీకేఎంయు సభ్యులు మదేల ఎల్లేష్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో బీకేఎంయు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచి ప్రజాసంక్షేమాన్ని గాలికి వదిలి కార్పోరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ ఇప్పటికే అనేక ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవే టుపరం చేసి ఉపాధిఅవకాశాలను నిర్వీర్యం చేసి నిరుద్యోగాన్ని పెంచిపోషిస్తున్నారని మండిపడ్డారు.

ఈ కార్యక్రమంలో బట్టు మల్ల య్య, కొట్టే ప్రభాక ర్, బిక్షపతి, కొట్టే వెంకటేష్, కొమురయ్య, అంకుష్‌లు పాల్గొన్నారు.

బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా అమ్మ శ్రీను

నవతెలంగాణ-పర్వతగిరి

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని చెరువుకొమ్ము తండా గ్రామానికి చెందిన ధరావత్ అమ్మ శ్రీను(శ్రీనివాస్) బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా నియామకమయ్యారు. ఈమేరకు బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జే.కల్యాణ్ నాయక్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. శ్రీను నియామకంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
ములుగు
21 నుంచి 24 వరకు
మేడారం మహాజాతర
ఆదివారం | ఫిబ్రవరి 25, 2024 | www.navatelangana.com












మేడారం జాతర దృశ్యమాలిక











కాంగ్రెస్ గ్రామాధ్యక్షులుగా సతీష్ నియామకం



నవతెలంగాణ-బయ్యారం

మండలంలోని సంతులాల్ పోడు గ్రామ శాఖ కాంగ్రెస్ అధ్యక్షులుగా భూక్యా సతీష్ నాయక్‌ను నియమిస్తూ శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు కంబాల ముసలయ్య నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భూక్యా సతీష్ నాయక్ మాట్లాడుతూ తనను గ్రామశాఖ అధ్యక్షులుగా ఎన్నిక చేసినందుకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ టీపీసీసీ నాయకులు, మాజీ ఎంపీపీ గుగులోత్ కిషన్ నాయక్, మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యాదర్శి ములుకూరి వీరారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు జూలకంటి సీతారాం రెడ్డి, కసనబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం



నవతెలంగాణ-కేసముద్రం రూరల్

కేసముద్రం మండలంలోని తౌర్యతండ గ్రామ పంచాయతీ పరిధిలోని దుబ్బ తండాలో ఎంఎస్ఆర్ ఇజిఎస్ నిధులతో 5 లక్షల విలువ చేసే రెండు (సీసీ) సిమెంట్ రోడ్లను ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ మండలాధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తౌర్య తండా మాజీ సర్పంచ్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు బండారు దయాకర్, గ్రామాధ్యక్షులు గుగులోతు రాము, మాజీ ఉప సర్పంచ్ వాంకుడోత్ మంగమ్మ, మాజీ గ్రామాధ్యక్షులు ముడావత్ రామ్ చంద్రు, భూక్య రామ్ తండ గ్రామాధ్యక్షుడు జాటోత్ రమేష్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వాంకుడోత్ బాబులాల్, మాజీ వార్డు సభ్యులు శ్రీధర్, మాలోత్ హర్య, వాంకుడోత్ సునీత,రాజు, వాంకుడోత్ వాగ్య, తండ నాయకులు వీరన్న, అశోక్, మైబు, రాము, భీమా తదితరులు పాల్గొన్నారు..

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-మహబూబాబాద్

2024-25 సంవత్సరానికి గాను హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (బేగంపేట్)లో ఒకటవ తరగతి ప్రవేశాల కోసం మహబూబాబాద్ జిల్లాలోని ఆసక్తి గల ఎస్సీ విద్యార్థులు ఈ నెల 26 నుండి మార్చ్ 12 వరకు దరఖాస్తులను షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖాధికారి మహబూబాబాద్ కార్యాలయంలో అందజేయాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖాధికారి ఆర్. బాలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ కుటుంబాలలోని గ్రామీణ ప్రాంతాలవారు రూపాయలు 1,50,000, పట్టణ ప్రాంతాల వారు రూపాయలు 2,00,000 ఆదాయం కలిగి ఉండాలని, విద్యార్థులు 01-06-2017 నుండి 31-05-2018 మధ్య జన్మించి ఉండాలని, కులం, ఆదాయం, నివాసం, జనన ధృవీకరణ పత్రంతో పాటు తెల్లరేషన్ కార్డ్, ఆధార్ కార్డ్, పాస్ ఫోటోలతో దరఖాస్తు చేయాలన్నారు.

నంది మేడారం జాతరలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్



నవతెలంగాణ-బయ్యారం

మండల పరిధిలోని గంధంపల్లి గ్రామంలోని నంది మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో శనివారం మహబూబాబాద్ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ బిందు నాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అంగోత్ కాంతి, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం వెంకటేశ్వర, మల్లికార్జున స్వామి కళ్యాణం

- పురవీధుల్లో పల్లకి సేవ, ఎల్లమ్మకు బోనాలు సమర్పించిన గ్రామస్తులు



నవతెలంగాణ-పాలకుర్తి

మండలంలోని తొర్రూరు బోడగుట్టపై జరిగిన వెంకటేశ్వర స్వామి, మల్లికార్జున స్వామిల కళ్యాణం కమనీయంగా జరిగింది.శనివారం పౌర్ణమిని పురస్కరించుకొని జరిగిన కళ్యాణ వేడుకల్లో ఎంపీటీసీ మడిపల్లి కౌసల్య సోమయ్య, పాలకుర్తి ఆలయ మాజీ చైర్మన్ చిలువేరు కృష్ణమూర్తి యాదవ్, బీఆర్ఎస్ మండల ప్రచార కార్యదర్శి మడిపల్లి వేణు, మాజీ సర్పంచ్ నాయిని మల్లారెడ్డిలతో పాటు గ్రామస్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి కళ్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామి వారాలను పల్లకి సేవలు గ్రామ పురవీధుల ద్వారా ఊరేగించారు. గ్రామస్తులు మహిళలు హారతులతో స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో గల ఎల్లమ్మకు గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి మహేష్ ఆలయం వద్ద ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పులి భాస్కర్ గౌడ్, మడిపల్లి రాజు, మడిపల్లి రమేష్, చిలువేరు సంపత్ యాదవ్, ప్రభాకర్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ స్వామి వ్రతాలు, పూజలు

నవతెలంగాణ-బచ్చన్నపేట

మండలంలోని బసనాగారం గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం అధికారి శ్రీరామ్ రెడ్డి కృష్ణమూర్తి ఆదేశం మేరకు మాగా పౌర్ణమి సందర్భంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో జరిగినట్లు శ్రీరామదాసు భజన మండలి తెలుగు రాష్ట్ర శాఖల అధ్యక్షులు సిద్దేశ్వర్ తెలిపారు. 30 జంటలు పైగా పూజలు చేశారన్నారు. ఆలయం వద్ద తీర్థప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామలింగేశ్వర భజన మండలి, గ్రామస్తులు, గ్రామ పెద్దలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మండలాధ్యక్షునిగా చిమ్ముల నరేందర్ రెడ్డి

నవతెలంగాణ-బచ్చన్నపేట

జనగామ జిల్లాలో బీజేపీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా జిల్లాలోని పలుమండలాల అధ్యక్షులను, మోర్చాల అధ్యక్షులను బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆరుట్ల దశమంత్ రెడ్డి శుక్రవారం ప్రకటించారు.ప్రస్తుతం ఉన్న మండలాధ్యక్షులను జిల్లా కమిటీలో బాధ్యులుగా వారి సేవలను వినియోగించుకోవడం జరుగుతుందని జిల్లాఅధ్యక్షులు తెలిపారు.బచ్చన్నపేట మండలాధ్యక్షునిగా చిమ్ముల నరేందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా పైన నమ్మకంతో బచ్చన్నపేట మండలాధ్యక్షులుగా అవకాశం ఇచ్చిన జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఆరుట్ల దశమంత్ రెడ్డికి, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

మండలాధ్యక్షునిగా సంపత్

నవతెలంగాణ-పాలకుర్తి

బీజేపీ మండలాధ్యక్షునిగా పాలకుర్తికి చెందిన దుంపల సంపత్‌ను నియమిస్తూ శనివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ పాలకుర్తి మండలంలో పార్టీ పటిష్టత కోసంకృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

మచ్చుపహడ్‌లో ఘనంగా పెద్ద పండుగ ప్రారంభం

నవతెలంగాణ-నర్మెట్ట

మచ్చుపాహడ్ గ్రామంలో బీరప్ప పెద్ద పండుగాను శనివారం ఘనంగా ప్రారంభించారు. బీరప్ప విగ్రహంను పూజించి ధాన్యంలో ఉంచారు.మచ్చుపహాడ్ కురుమ సంఘం సభ్యులు మాట్లాడుతూ వారం రోజుల పాటు పెద్ద పండుగ ఉంటుందని తెలిపారు.



పోలేపల్లి పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

నవతెలంగాణ-శాయంపేట

భూమి విక్రయంలో మిగిలిన డబ్బులు చెల్లించాలని అడగడంతో కులం పేరుతో దూషించగా బాధితుడు ఫిర్యాదు మేరకు పోలేపల్లి శ్రీనివాసరెడ్డి పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... శాయంపేట గ్రామానికి చెందిన మారేపల్లి సుమన్ కు హనుమకొండ పట్టణంలోని గోపాలపురంలో భూమి ఉండగా తన అవసరాల నిమిత్తం భూమి అమ్మకానికి పెట్టగా, కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి 17 లక్షలకు కొనుగోలు చేశాడు. భూమి అమ్మిన సమయంలో సుమన్ కి 11 లక్షలు చెల్లించి, మిగతా 6 లక్షలకు ఒక నెల గడువు పెట్టినట్లు తెలిపారు. గడువు ముగియడంతో సుమన్ తనకు రావాల్సిన డబ్బులను అడగగా, రేపు మాపు అంటూ దాటవేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 7న డబ్బుల కోసం సుమన్ శ్రీనివాసరెడ్డికి ఫోన్ చేయగా కులం పేరుతో దూషించి చంపుతా అని బెదిరించినట్లు తెలిపారు. బాధితుడు సుమన్ పిర్యాదు మేరకు శ్రీనివాస్ రెడ్డి పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మహబూబాబాద్-జనగామ
ఆదివారం | ఫిబ్రవరి 25, 2024 | www.navatelangana.com

పల్స్ పోలియో విజయవంతం చేయాలి : అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్

నవతెలంగాణ-మహబూబాబాద్

పల్స్ పోలియో కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అధికారులను ఆదేశించారు.శనివారం సమీకృత జిల్లా అధికారుల భవన సముదాయం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతానికి అదనపు కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఐదు సంవత్సరాలలోపు 62,071 మంది చిన్నారులు ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో విజయం చేయాలన్నారు. పల్స్ పోలియో చుక్కల విశిష్టతపై విస్తృత ప్రచారం చేపట్టాలని గ్రామాలలో పట్టణాలలో ర్యాలీలు నిర్వహించాలని ఫ్లెక్సీల ద్వారా ప్రతి ఒక్కరికి తెలిసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తల్లితండ్రులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అందుబాటులో లేనివారు మార్చి 4, 5 తేదీల్లో ఇంటింటి సర్వే చేపట్టి చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు సిబ్బంది పర్యటించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో రమాదేవి, జిల్లా వైద్య శాఖ అధికారి అంబరీష, మున్సిపల్ కమిషనర్ రవీందర్, విద్యాశాఖ ఏసీఈ అధికారి శ్రీరాములు, డివిజనల్ పంచాయతీ అధికారి గంగా భవాని, విద్యుత్ శాఖ ఏడిఈ ఇందిర, పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ విజయకుమార్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విధుల్లో చేరిన జనగామ నూతన కలెక్టర్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్



జనగామ జిల్లా నూతన కలెక్టర్‌గా బదిలీపై వచ్చిన రెజ్వాన్ భాషా షేక్ శనివారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలందించడమే లక్ష్యంగా అధికారులుపని చేయాలని కోరారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో శాఖల వారీగా సమీక్ష నిర్వహించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్లు రోహిత్ సింగ్, పింకేశ్ కుమార్, ఇతర జిల్లా అధికారులు, ప్రముఖులు ఆయనకు పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు.



దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఏసీపీ దామోదర్ రెడ్డి

నవతెలంగాణ-జనగామ

ట్రాన్స్ఫార్మర్లలోని కాపర్ వైర్లను ఎత్తుకు వెళ్లే దొంగల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ దామోదర్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఏసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత కొన్ని రోజులుగా వ్యవసాయ బావుల వద్ద ఉన్న ట్రాన్స్ఫార్మర్లను పగలగొట్టి అందులోని కాపర్ వైరును ఎత్తుకెళ్తున్నారన్నారు. దీనివల్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయి రైతులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు.ఒకట్రాన్స్ఫార్మర్‌లో కాపరు వైరు ఎత్తుకెళ్లడం ద్వారా దొంగలు పదివేల రూపాయలు పొందుతారో ఏమో కానీ తిరిగి తిరిగి ట్రాన్స్ఫార్మర్ అమర్చడానికి లక్ష రూపాయలు ఖర్చవుతాయన్నారు.కాపర్ వైర్ దొంగతనాలను అరికట్టేందుకు ప్రజలు సహకరించాలని, స్థానికంగా విద్యుత్ సిబ్బందితోపాటు రైతు సమన్వయ కమిటీ సభ్యులను. రైతులను, పోలీసు, విలేజ్ సెక్రటరీలతో కలిపి గ్రామాల వారీగా కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అపరిచితులు అనుమానాస్పదంగా తిరిగితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. రాబోయే ఎండాకాలంలో మరిన్ని దొంగతనాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో సీఐ రఘు, ఎస్సైసృజన్, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

దాతల సహాయం కోసం ఎదురు చూపు

- నిమ్స్ ఆసుపత్రిలో రోజుకు లక్షన్నరకుపైగా చికిత్స ఖర్చు

నవతెలంగాణ-గార్ల



పేదముస్లిం కుటుంబానికి చెందిన ఓ మహిళ ప్రమాదవశాత్తు ఇంట్లో జారి పడి తలకు బలమైన గాయంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వైద్య ఖర్చుల కోసం దాతల సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. వివరాల్లోకి వెళ్లితే మండల కేంద్రానికి చెందిన షేక్ షాహిదా అనే పేద కుటుంబానికి చెందిన మహిళ గత వారం రోజుల క్రితం ఇంట్లో కాలు జారిపడి తలకు బలమైన గాయం కావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు.తలకుబలమైన గాయం అయి మెదడు నరాలు దెబ్బతిన్నాయని వైద్యులు సూచించారని ఆస్పత్రిలో రోజుకు లక్షన్నర రూపాయల వరకు వైద్యం ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. షాహిదా భర్త హుస్సేన్ బేగ్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. షాహిదా కుతురు పెళ్లి కోసం కూడబెట్టిన డబ్బులను ఇప్పటి వరకు వైద్య ఖర్చులకు ఖర్చు చేశామని, ఇంక మెరుగైన వైద్యం అందించడానికి దాతలు సహృదయంతో అదుకోవాలని కుటుంబ సభ్యులు దాతలను కోరుతున్నారు. దాతలు ఈ క్రింది నెంబరుకు ఫోన్ ఫే, గూగుల్ ఫే ద్వారా 9849313868 నెంబర్‌కు ఆర్థిక సహాయం చేసి తన భార్య షాహిదాను ప్రాణాపాయ స్థితి నుండి కాపాడి ప్రాణ బిక్ష పెట్టాలని బాధితురాలు భర్త హుస్సేన్ బేగ్ చేతులు జోడించి వేడుకుంటున్నారు.



గిరిజనులు అన్ని రంగాల్లో రాణించాలి

- మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్

నవతెలంగాణ-మరిపెడ

గిరిజన యువకులు అన్నిరంగాలలో రాణించాలని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ అన్నారు. సేవాలాల్ 285వ జయంతి సందర్భంగా గిరిజనుల క్రికెట్ టోర్నమెంట్ రాష్ట్ర స్థాయి క్రీడాకారులకు డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రామచంద్రనాయక్ స్పాన్సర్ చేసిన టీషర్టను మరిపెడ మండల యువజన నాయకుడు విజయ్‌నాయక్ ఆధ్వర్యంలో మాజీఎమ్మెల్సీ రాములు నాయక్ పంపిణీ చేశారు. శనివారం హైదరాబాదులోని ఎల్బీ స్టేడియంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణలో భాగంగా రాష్ట్ర స్థాయిలో మొత్తం 150 టీంలు పాల్గొన్నాయి. మొదటి బహుమతి లక్ష, ద్వితీయ బహుమతి 50 వేల రూపాయలు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీఐ కాశీరాం నాయక్, గిరిజన నాయకులు భూక్యా విజయ్, సీనియర్ నాయకుడు సుభాష్ నాయక్, అశోక్, క్రీడాకారులు మోహన్ నాయక్, సురేష్ నాయక్, రమేష్ నాయక్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-లింగాలగణపురం



మండలంలోని చీటూరు గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఈదుల కంటి నరసింహారెడ్డి దశదిన కార్యక్రమంలో శనివారం జనగామ జిల్లా కాంగ్రెస్ నాయకులు పోరెడ్డి మల్లారెడ్డి పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం చేసి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంట అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు నకిర్త మల్లయ్య, చేరెడ్డి వెంకటరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ బర్ల గణేష్, బోయినీ సత్తయ్య, యూత్ నాయకులు ఎలిషల రవి, ఎండీ అమ్జాద్, పసుల శ్రీను, శ్రావణ్ గౌడ్ తేజ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మోడీ సర్కార్ మూల్యం చెల్లించక తప్పదు







- ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ, అఖిల పక్షాల నిరసన

నవతెలంగాణ-మహబూబాబాద్

అన్నదాత రైతన్నలను కాల్చి చంపిన నరేంద్ర మోడీ సర్కార్ మూల్యం చెల్లించక తప్పదని ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పర్వత కోటేష్, హలావత్ లింగన్నలు హెచ్చరించారు. నరేంద్ర మోడీ విధానాలకు నిరసనగా నిరసన(బ్లాక్ డే) దినాలుగా పాటించాలని సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా శనివారం మహబూబాబాద్ పట్టణంలోని వివేకానంద సెంటర్లో మోడీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ సుస్థిర పాలన అంటే రైతన్నలను కాల్చి చంపడమా..? కార్మికుల ఉపాధి కొల్లగొట్టడమా..? అని ఆయన నిలదీశారు. నల్లడబ్బును వెలికి తీసి పేద ప్రజల జన్‌ధన్ ఖాతాలో వేసి, ప్రజల కొనుగోలు శక్తి పెంచుతామని హామీ ఇచ్చి, నేడు ప్రజా సంపదను అంబానీ, ఆదాని దొచిపెట్టడానికి రైతు కార్మిక ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నారన్నారు. శుభకరణ్ సింగ్‌ను కాల్చి చంపిన పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని, వారి కుటుంబానికి కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగాన్ని ఇవ్వాలని, గాయపడిన రైతులందరికీ ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.రైతులకు రాతపూర్వకంగా ఇచ్చిన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని, నిర్బంధాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు ఏరియా కార్యదర్శి పులిగిల్ల బాలమల్లు, నాయకులు దేవేందర్, హుస్సేన్, అమీర్, చైతన్య, కాటం రాజు, వేణు, సుధాకర్, మధు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మరిపెడ : హర్యానా యువ రైతు శుభకరన్ సింగ్‌ను పంజాబ్ బార్డర్‌లో క్రూరంగా హత్య చేయించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని, దీనికి కారకులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షులు కొండ ఉప్పలయ్య అన్నారు. శనివారంమరిపెడ మండలకేంద్రంలో సీఐటీయూ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొండ ఉప్పలయ్య పాల్గొని మాట్లాడుతూ యువ రైతు శుభకరన్ సింగ్ మృతి పట్ల సీఐటీయూ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ వారికి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ ఘటనకు కారణమైన పోలీస్ సిబ్బందిపై సెక్షన్ 302 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి వెంటనే వారందరిని భర్తరఫ్ చేయాలన్నారు. యువ రైతు కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు తమ సమస్యలు పరిష్కరించమని 2014లో నెలల తరబడి వెయ్యి మందికి దగ్గర రైతులు అమరులై పోరాడి మూడు వ్యవసాయ కార్మిక చట్టాలను ఇదే బిజెపి ప్రభుత్వం పై పోరాటం చేసి ఆచట్టాలను రద్దు చేయించడం జరిగింది. ఆ సందర్భంలో నరేంద్ర మోడీ రైతులకు క్షమాపణ చెప్పి రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేస్తున్నామని హామీ ఇచ్చి రైతులను మోసగించిందనారు. రైతులపై దాడిని దేశవ్యాప్తంగా ఖండిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ (సీఐటీయూ) యూనియన్ నాయకులు కామిడ్ల వెంకన్న, జినక సైదులు, జిన్న నాగయ్య, జిన్న మైసయ్య, జినక ఎర్ర ఎంకన్న, జినక వెంకన్న, జినక రాములు, జిన్న రాములు, జిన్న రవి, జినక వెంకన్న, జిన్న జంపయ్య, భాష్పంగు గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం : సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన బ్లాక్ డే పిలుపులో భాగంగా శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్లో ఆర్ఎస్ఎస్ బిజెపి మోడీ సర్కార్ అనాగరిక, పాసిస్ట్ నియంతృత్వ విధానాలకు నిరసనగా బ్లాక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల పక్ష రైతు సంఘాల నాయకులు అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మన రాజన్న, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు రామగిరి బిక్షం, ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఉమ్మగాని సత్యనారాయణ మాట్లాడుతూ చారిత్రాత్మకమైన రైతాంగ పోరాటం ఫలితంగా మోడీ సర్కార్ రైతాంగానికి క్షమాపణ చెప్పి రైతాంగ సమస్యలను ఆరు నెలల్లో పరిష్కరిస్తానని చెప్పి లిఖితపూర్వకంగా హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. మోడీ సర్కార్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని హర్యానా, పంజాబ్ లక్షల మంది రైతాంగం తమవాహనాల్లో శాంతి యుతంగా ఢిల్లీకి యాత్ర నిర్వహిస్తున్నటువంటి క్రమంలో హర్యానా, పంజాబ్ బార్డర్లో రైతాంగం పై నరేంద్ర మోడీ ప్రభుత్వం టియర్ గ్యాస్, వాటర్ కెనాల్స్, రబ్బర్ బుల్లెట్ల ద్వారా విచక్షణా రహితంగా కాల్పులు జరిపి శుభకరణ్ సింగ్‌ను పొట్టన పెట్టుకొని 25 మంది రైతులను క్షతగాత్రులను చేసిన నియంతృత్వ నరహంతక మోడీ సర్కార్‌కు తగిన బుద్ధి చెప్పాలని రైతాంగానికి పిలుపు నిచ్చారు. ఇప్పటికైనా మోడీ సర్కార్ రైతాంగానికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతాంగం, అన్ని వర్గాల ప్రజలు సమరశీల పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నంబూరి మధు, తుడుం వీరభద్రం, రామచంద్ర మురళి,అల్లాల బిక్షం,చంటి మోహన్, శీలంశెట్టి వెంకన్న, తేజావత్ హుస్సేన్, అజ్మీర తేజ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- మంత్రి శ్రీనివాస్ రెడ్డిని కోరిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

నవతెలంగాణ-పాలకుర్తి



పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్లతో పాటు కాలువల నిర్మాణం కోసం భూములు కోల్పోయిన బాధిత రైతులను ఆదుకునేందుకు నష్టపరిహారం అందించేందుకు వెంటనే నిధులు మంజూరు చేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. శనివారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి హైదరాబాదులో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.నియోజకవర్గ అభివృద్ధిపైవివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం సందర్భంగా పాలకుర్తి నియోజకవర్గం ప్రజలకు అభివృద్ధిపై అనేక హామీలు ఇచ్చామని, నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ పనులు ప్రారంభమై ఏండ్లు గడుస్తున్నప్పటికీ గత బీఆర్ఎస్ పాలనలో రిజర్వాయర్ పనులు నిర్లక్ష్యానికి గురయ్యాయని తెలిపారు. రిజర్వాయర్‌తో పాటు కాలువల క్రింద భూములు కోల్పోయిన రైతులు వందలాది మంది నష్టపరిహారం కోసం ఎదురుచూస్తున్నారని మంత్రి శ్రీనివాస్ రెడ్డికి వివరించారు. రిజర్వాయర్ పనులు పూర్తి కాకపోవడంతో కొడకండ్ల, పాలకుర్తి, దేవరుప్పుల మండలాలకు నేటికీ పూర్తి స్థాయిలో సాగునీరు అందలేదని తెలిపారు. దేవాదుల వరద కాలువతో పాటు ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించి రైతాంగాన్ని ఆదుకోవడమే ధ్యేయంగా ప్రణాళికను సిద్ధం చేశామని తెలిపారు. పాలకుర్తి రిజర్వాయర్లో బొమ్మెర గ్రామానికి చెందిన రైతులు భూములు కోల్పోయారని, భూములు కోల్పోయిన రైతులను ఆదుకోవడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. రిజర్వాయర్లతోపాటు కాలువల క్రింద భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకుంటానని భరోసా ఇచ్చారు.

నియోజకవర్గ అభివృద్ధిపై నిధులు కేటాయించాలని మంత్రి శ్రీనివాస్ రెడ్డిని కోరడంతో స్పందించారని, రిజర్వాయర్లలో భూములు కోల్పోయిన రైతులను ఆదుకోవడంతో పాటు పాలకుర్తి నియోజకవర్గం పై ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకరిస్తానని భరోసా ఇచ్చారని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్‌లు సీజ్ : సీఐ


నవతెలంగాణ-నెల్లికుదురు

అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న మూడు సీజ్ చేసినట్లు తొర్రూర్ సిఐ సంజీవ్ తెలిపారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ తొర్రూర్ సర్కిల్ పరిధిలో ఆకేరువాగులోని ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న క్రమంలో నర్సింలపేట మండలంలోని రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తెలిపారు. వాటిని మైనింగ్ అధికారులకు అప్పగిస్తున్నామని తెలిపారు. ఎవరైనా ఆకేరువాగు ఏరియాలో ఇసుకను అక్రమంగా రవాణ చేస్తే ఊరుకునేది లేదన్నారు. అంతే కాకుండా దొంగతనాలకు పాల్పడిన వ్యక్తులను సహించేది లేదని హెచ్చరించారు. మండలంలోని ఆకేరి వాగులో నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ కోడి చింతల రాజు అన్నారు. మండల కేంద్రంలో ఆయన శనివారం మాట్లాడారు. ఆఖరి వాగు పరిసర ప్రాంతంలో మండలంలోని బ్రాహ్మణ కొత్తపల్లి నెల్లికుదురు మునిగలవీడు, ఎర్రబెల్లి గూడెం, మేచరాజుపల్లి గ్రామాల్లో అక్రమంగా ఇసుక రవాణ చేస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వాసవిక్లబ్ నూతన సభ్యుల ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-లింగాలఘనపురం

వాసవిక్లబ్ లింగాలగణపురం మండలం నూతన క్లబ్ సభ్యుల ప్రమాణ స్వీకారం శనివారం మండలంలోని జీడికల్ వీరాచల రామచంద్రస్వామి దేవాలయం ఆవరణలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ గవర్నర్ గంప సాంబమూర్తి, దొడ్డ కృష్ణమూర్తి, గార్లపాటి సంతోష్ కుమార్, గంగిశెట్టి ప్రమోద్, గట్టు వెంకన్న, నూతన అధ్యక్షులుగా దారం అశోక్, సెక్రెటరీ మెతుకు అనంతరాములు, ట్రెజరర్ బెల్లశ్రీధర్,ఫస్ట్‌వైస్ ప్రెసిడెంట్ గుడిసెల శివరామకృష్ణ, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



బాలిక కిడ్నాప్ కలకలం

నవతెలంగాణ-బయ్యారం



మండలంలో ఓ బాలికను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించడం కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న ప్రణతి జగ్గుతండా నుంచి పాఠశాలకు వెళ్తుతుంది. ఈ క్రమంలో కాకతీయనగర్ వీధి దగ్గర బైక్ పై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ప్రణతిని బలవంతంగా బైకుపైకి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో విద్యార్థిని వారితో పెనుగులాడుతుండగా గమనించిన స్థానికులు అక్కడికి చేరుకోగా దుండగులు బైక్‌పై పారిపోయారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

మైనార్టీలు బలోపేతం కావాలి : అంజతుల్లా ఖాన్

నవతెలంగాణ-మరిపెడ



మైనార్టీలు రాజకీయంగా బలోపేతం కావాలని, అంతా కలిసి ఏకతాటిపై ఉంటూ తమ హక్కుల సాధనకు, దేశంలో తమ ఉనికిని కాపాడుకునేందుకు కృషి చేయాలని మజ్లిస్ బజావో తెహరిక్ పార్టీ (ఎంబీటీ) చీఫ్ జనాబ్ అంజతుల్లా ఖాన్ సూచించారు. శనివారం ఆయన ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఓ కార్యక్రమానికి వెళ్తూ మార్గమధ్యంలో మరిపెడ మండల కేంద్రలోని మదర్స ఏ ఇస్లామీయ రౌజతుల్ బనాత్ బాలికల మదర్సాను సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మైనార్టీలను ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో మైనార్టీలు ముందు వరుసలో ఉండి పోరాడారని, నేడు అదే ఉద్యమ స్ఫూర్తితో చట్టసభల్లో మైనార్టీలకు సముచిత న్యాయం లభించేవరకు పోరాటం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ యూత్ లీడర్ అఫ్సాన్ ఉల్లా ఖాన్, మదర్స ఏ ఇస్లామీయ రౌజతుల్ బనాత్ బాలికల మదర్సా ప్రిన్సిపల్ మౌలానా సాధిక్, వైస్ ప్రిన్సిపాల్ సాజిద్, హుస్సేమీ, ఉపాధ్యాయుడు మౌలానా అబ్దుల్ జబ్బార్, జామా మస్జీద్ యూత్ అధ్యక్షుడు షేక్ సబ్దార్, సయ్యద్ లతీఫ్, ఖాజా పాషా, అబ్దుల్ సత్తార్, మహబూబ్, రెగ్సీస్ మహమూద్, గౌస్, రహమాన్, బాషిత్ ఖాన్, జాకీర్, అఫ్సర్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభించిన ఈజీఎస్ డైరెక్టర్

నవతెలంగాణ-కొడకండ్ల



మండల కేంద్రంలోని హరిజన కాలనీలో శనివారం కల్వర్టు నిర్మాణ పనులను ఈజీఎస్ డైరెక్టర్ అందే యాకయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. కాంట్రాక్టర్ నాణ్యత లోపం లేకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ మాజీ డైరెక్టర్ సతీష్, అందే రాజారావు, అందే సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాల పంపిణీ

నవతెలంగాణ-మహబూబాబాద్



మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలను మహబూబాబాద్ అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్‌కు గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు గుగులోత్ కిషన్ నాయక్ శనివారం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచీకరణలో భాగంగా యువత మహనీయుల చరిత్ర తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని, జీవిత చరిత్రలను కింది తరాలకు అందించాల్సిన బాధ్యత అధికారులకు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు వాసం ఆనంద్ కుమార్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సురుగు ఐలయ్య, కొప్పుల రమేష్ న్యాయవాది పాల్గొన్నారు.

నేడు కవనతీగ పుస్తకావిష్కరణ

నవతెలంగాణ-జనగామ




నేడు జనగామ జిల్లా కేంద్రంలో యువ కవి, సంగీత దర్శకులు చిలుమోజు సాయికిరణ్ రచించిన కవనతీగ పుస్తక ఆవిష్కరణ నిర్వహించనున్నట్లు కవులు కళాకారుల ఐక్యవేదిక జనగామ జిల్లా కన్వీనర్ జి కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. శనివారం శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షుడు లగిశెట్టి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఐక్యవేదిక కళా, సాహితి సంస్థల సమావేశంలో ఆయన మాట్లాడారు. కవులు కళాకారుల ఐక్యవేదిక, స్వేచ్ఛ పబ్లికేషన్స్ జేఎస్కే ట్యూన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10గంటలకు విజయ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.సాయికిరణ్ 26వ జన్మదినం పురస్కరించుకొని కవనతీగ పుస్తక ఆవిష్కరణతో పాటు గుమ్మడిల్ల ఎక్సలెన్సీ అవార్డ్స్ ప్రధానం, విద్యా, సాహిత్య సంగీత కళా రంగాల్లోని గురువులకు ఆత్మీయ సత్కారం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విరసం కవి శాఖమూరి రవి, ప్రముఖ సినీదర్శకులు తాళూరి రాజ్, యుట్యూబ్ ఫేం సింగర్ యాక్టర్స్ పాల్గొంటారని తెలిపారు. కళా, సాహితి అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో కవి చిలుమోజు సాయికిరణ్, పెట్లోజు సోమేశ్వరాచారి, అయిలా సోమనర్సింహాచారి, పొట్టబత్తిని భాస్కర్, డాక్టర్ వేముల సదానందం, అంబాల శివనాథ్ గౌడ్, గడ్డం మనోజ్ కుమార్ గౌడ్, టి.రామచంద్రం, అంకాల సోమయ్య, జోగు సుదర్శన్, కూచిపూడి కిరణ్ కుమార్, తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్ పాల్గొన్నారు.


విద్యార్థులను ఉన్నత స్థాయిలో నిలబెట్టేది చదువే : చిలువేరు సమ్మిగౌడ్

నవతెలంగాణ-కేసముద్రం రూరల్

విద్యార్థులను ఉన్నత స్థాయిలో నిలబెట్టేంది చదువేనని సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ అన్నారు. కేసముద్రం మండలంలోని తిమ్మంపేట గ్రామ శివారు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, కళాశాలలో విద్యార్థులకు రాత పరీక్షకు సంబంధించిన సామగ్రి కిట్టును ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో సమ్మిగౌడ్ ఫౌండేషన్ తరపున అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్యం దిశగా ప్రయాణిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, సమ్మిగౌడ్ ఫౌండేషన్ ఎల్లప్పుడు మీకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఫౌండేషన్ సలహాదారులు సామల నర్సయ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నపుడే వారి జీవితంలో అన్ని రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చుని సూచిస్తూ సమ్మిగౌడ్ చేస్తున్న సేవలను అభినందించారు. స్పెషల్ ఆఫీసర్ నీలిమమాట్లాడుతూ విద్యార్థుల ప్రోత్సహిస్తున్న సమ్మిగౌడ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో చాగంటి రాములు, వీరేందర్, కేజీ బీవీ సిఆర్‌టిలు ఎస్.సుష్మ, ఎస్.కె రహిమా, పీజీ సీఆర్‌టిలు సృజన, అనిత, అపర్ణ, అకౌంటెంట్ స్నేహలత, ఏఎన్ఎం వసంత, హెల్త్ డిపార్ట్మెంట్ బి.శ్రీనివాస్, తిమ్మంపేట జిపి కారోబార్ మందుల పెంటయ్య, ఆశా కార్యకర్తలు లకావత్ కవిత, జాటోత్ జ్యోతి, సీనమ్మ, పొన్నం కవిత కళాధర్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ 5



జయశంకర్- భూపాలపల్లి

ఆదివారం | ఫిబ్రవరి 25, 2024 | www.navatelangana.com

వనంలోకి సమ్మక్క, సారక్కలు



నవతెలంగాణ-మొగుళ్లపల్లి

సమ్మక్క-సారలమ్మలు శనివారం తిరుగుపయనమై అడవి తల్లి వద్దకు చేరుకున్నారు. పూజారులు సాంబారావు, గట్టయ్యలు సమ్మక్క సారలమ్మలను వన ప్రవేశానికి తరలించారు. కమిటీ అధ్యక్షులు బుర్ర సదయ్య గౌడ్, కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు అందరూ కలిసి అమ్మవార్లను డప్పు చప్పుల మధ్య జాతర ప్రాంగణం నుంచి తీసుకువెళ్లారు. కాగా ఈ జాతరకు మండలంతో పాటు పక్క జిల్లాల నుండి సుమారు 2 లక్షల మంది పర్యాటకులు తరలి వచ్చినట్లు ఈ ఓ నాగేశ్వర్ రావు, జూనియర్ అసిస్టెంట్ మహిపాల్ తెలిపారు. ఎస్సై మాధవ్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు చేపట్టి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పలు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

కాళేశ్వరంను దర్శించుకున్న హైకోర్టు జడ్జి

నవతెలంగాణ-మహదేవ్‌పూర్

తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి నామవరపు రాజేశ్వర్‌రావు కుటుంబ సమేతంగా శనివారం కాళేశ్వర ముక్తేశ్వరస్వామి వారిని దర్శించు కున్నారు. జడ్జి కు టుంబ సభ్యులకు బుర్రి శ్రీనివాస్ సూప రింటెండెంట్ ఆధ్వ ర్యంలో దేవస్థానం అర్చ కులు, వేద పండితులు ఆలయ మర్యా దలతో పూర్ణకుంభతో స్వాగతం పలికారు. అనంతరం కాళేశ్వర ముక్తేశ్వరస్వామి వారికి అభిషేకం, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి శేష వస్రాతలతో వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు జడ్జీలు, కోర్టు సిబ్బంది, డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి, మహదేవపూర్ సీఐ రాజేశ్వర్ రావు, ఎస్సై భవన్సేన్ పాల్గొన్నారు.





ఘనంగా గోదావరి నదికి హారతి

నవతెలంగాణ-మహదేవ్‌పూర్

దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమీషనర్ హైదరాబాద్ ఆదేశాల మేరకు ప్రతి నెల పౌర్ణమి రోజున గోదావరి నదీ హారతి కార్యక్రమం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా శనివారం కాళేశ్వర ముక్తేశ్వరస్వామి దేవస్థానం నుండి మంగళ వాయిద్యాలు, కోలాటాలు, వేదమంత్రాలతో గోదావరి నది వద్దకు వెళ్లి అర్చకులు, వేద పండితులు గోదావరి నది హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో ఆలయ సూపరిండెంట్ బుర్రి శ్రీనివాస్, ధర్మకర్తలు అడపసమ్మయ్య, కామిడి రామ్‌రెడ్డి, నిజామాబాద్ కోలాటం బృందం, సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.



సమ్మక్క-సారలమ్మలను దర్శించుకున్న డైరెక్టర్

నవతెలంగాణ-కోల్ బెల్ట్

ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం సమ్మక్క, సారలమ్మలను సింగరేణి సంస్థ డైరెక్టర్ డి. సత్యనారాయణ రావు (ఈ అండ్ ఎం) శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారితో పాటు అధికారులు కే. గురవయ్య జీఎం సేఫ్టీ , సిహెచ్ .వెంకటేశ్వర్లు జీఎం హెచ్ ఆర్ డి, భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ బళ్లారి శ్రీనివాసరావు, ఏరియా అధికార ప్రతినిధి అజ్మీర తుకారాం డీజీఎం (పర్సనల్) లు కూడా కుటుంబ సమేతంగా అమ్మవార్లని దర్శించుకొని మొక్కులు చెల్లించు కున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్, అధికారులు తల్లుల సేవలో తరించిన రెస్క్యూ సిబ్బందిని, ఇతర వాలంటీర్లను అభినందించారు.



స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-చిట్యాల

మండల కేంద్రానికి చెందిన మైదం సురేష్ ఇటీవల అనారోగ్యంతో మతి చెందాడు. మతుడి స్నేహితులు 1988-89 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ. 11వేల ఆర్థికసాయాన్నిమతుడి కుటుంబ సభ్యులకు అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో శంగారపు రంగాచారి, పాసికంటి మల్లేశం, గాజుల రమేష్, దేశెట్టి రాజు, జీవివి ప్రసాద్‌రెడ్డి, కట్ల సదయ్య, బుర్ర కుమారస్వామి, బిక్షపతి, ప్రభాకర్, పుట్టకొక్కుల రవీందర్, శ్రీపతి కష్ణమూర్తి, దువ్వల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఏఎఫ్‌యూ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడిగా సారయ్య

నవ తెలంగాణ-మల్హర్‌రావు

భూపాలపల్లి జిల్లా (ఏఎఫ్‌యూ) రైతు విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని వల్లెంకుంట గ్రామానికి చెందిన కొండ్ర సారయ్యను నియమించినటు రాష్ట్ర అధ్య క్షులు లింగమల్ల శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం నియా మకపత్రాన్ని అందజేశారు. తమపై నమ్మకంతో ఈ పదవిని అప్పజెప్పిన రాష్ట్ర అధ్యక్షుడు లింగ మల్ల శంకర్, కాళేశ్వరం జోనల్ నాయకులు చింతల కుమార్ యాదవ్, బండి సుధాకర్‌లకు సారయ్య ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవైయూ జిల్లా ఉపాధ్యక్షుడు కేశారపు సురేందర్, ఏఈడబ్ల్యూఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇందారపు రంజిత్, కార్యదర్శి ఇందారపు రాకేష్, ఏడబ్ల్యుయూ జిల్లా అధ్యక్షురాలు కొండ రాజమ్మ, కాటారం సబ్ డివిజన్ అధ్యక్షురాలు మమత, మండల అధ్యక్షురాలు ఏనుగు నాగరాణి పాల్గొన్నారు.



దుండగులను కఠినంగా శిక్షించాలి

నవ తెలంగాణ-మల్హర్‌రావు

జర్నలిస్ట్ శంకర్‌పై దాడిచేసిన వారిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఉత్తర తెలంగాణ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పీక కిరణ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యూస్ లైన్ తెలంగాణం తెలుగు దినపత్రిక చీఫ్ ఎడిటర్ సీనియర్ జర్నలిస్టు శంకర్‌పై దుండగులు చేసిన పైశాచిక దాడి ని తీవ్రంగా ఖండించినట్లుగా తెలిపారు.జర్నలిస్టులు ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ అనునిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించడానికి తమ కలంతో గలాన్ని వినిపిస్తుంటే వారిపై దాడులు చేయడం సమంజసం కాదని, పనికి మాలిన చర్య అని దుయ్యబట్టారు. లాగే జర్నలిస్టులపై దాడులు కొనసాగితే ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుందన్నారు.

ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను చిత్తుగా ఓడిస్తాం

ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లేతకారి రాజబాబు

మహదేవ్‌పూర్ : పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని చిత్తుగా ఓడించితీరుతామనిఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లేతకారి రాజబాబు అన్నారు. మేడిగడ్డపై బీఆర్ఎస్ చిల్లర రాజకీయాలు ఇకనైనా మానుకోవాలని విమర్శించారు. శుక్రవారం కాళేశ్వరంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆరు గ్యారంటీలపై మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. మేడిగడ్డ విషయంలో రైతుల నోట్లో మట్టికొట్టి బీఆర్ఎస్ నాయకులు కుబేరులయ్యారని, ఏ ఒక్క రైతును పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధం

ఈ నెల 28 నుంచి మార్చి 16వ తేదీ వరకు నిర్వహణ

జిల్లాల మొత్తం 8 పరీక్షా కేంద్రాలు

హాజరుకానున్న 3925 మంది విద్యార్థులు

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

నవతెలంగాణ-భూపాలపల్లి

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 28వ తేదీన నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. ఇప్పటికే విద్య, వైద్య, ఆరోగ్య, పోలీస్, విద్యుత్, పోస్టల్, ఆర్టీసీ శాఖ అధికారులతో కొన్ని రోజుల క్రితమే కాకుండా శనివారం సైతం జిల్లా అదనపు కలెక్టర్ కె. వెంకటేశ్వర్లు సమన్వయ సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని ఆయా శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఇంటర్ పరీక్షల నిమిత్తం 8పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా ప్రథమ సంవత్సరం 2161 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం 1764 మంది మొత్తంగా 3,925 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఈ నెల 28 నుంచి మార్చి 16వ తేదీ వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. విద్యార్థులను గంట ముందే పరీక్షా హాల్‌లోకి పంపు తామని ఇంటర్ బోర్డు ప్రకటించింది. నిమిషం ఆలస్యమైనా పరీక్ష రాసేందుకు అనుమతించే ప్రసక్తే లేదని ఇంటర్ బోర్డు స్పష్టం చేసింది. పరీక్ష నిమిత్తం ఇప్పటికే అన్ని రకాల పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని అధికారులు తెలిపారు.



జిల్లాలో ఏర్పాట్లు పూర్తి..

జిల్లాలో 8 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాలతో పాటు, చిట్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదర్శ కళాశాల, మరియు ఆదర్శ పాఠశాల, కాటారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, షెడ్యూల్ తెగల బాలుర జూనియర్ కళాశాల, మహదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యం, పారిశుధ్యం, ఫర్నీచర్ ఏర్పాటు చేశారు. లైటింగ్, ఫ్యాన్స్, టాయిలెట్స్ వంటి అవసరమైన వసతులను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున, పరిసర ప్రాంతాల్లో ఉన్న జిరాక్స్ షాపులు మూసేయనున్నారు.. పరీక్షల్లో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. నిరంతర పర్యవేక్షణకు నలుగురు ఫ్లయింగ్ స్క్వాడ్స్, నలుగురు సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేశారు.

పరీక్షలకు హాజరు ఇలా..

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 2161 మంది, ద్వితీయ సంవత్సరంలో 1764 మందితో కలిపి మొత్తం 3925 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కాగా ఇప్పటి వరకు హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకొని విద్యార్థులు నేరుగా ఇంటర్మీడియట్ వెబ్ సైట్ ద్వారా డౌన్ లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఇంటర్ పరీక్షల నిర్వహణకు కంట్రోల్ రూమ్ నెంబర్‌ను సైతం ఏర్పాటు చేశారు. పరీక్షలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు వీలుగా విద్యార్థులు, తల్లిదండ్రుల సౌకర్యార్థం జిల్లాలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. షేక్ ఇమ్రాన్ జూనియర్ అసిస్టెంట్ (800.8878060) వావిళ్ల తిరుపతి జూనియర్ అసిస్టెంట్ (94402833517 కంట్రోల్ రూం ఇన్చార్జిలుగా నియమించబడ్డారు. పరీక్షలకు సంబంధిం సమాచారాన్ని పై ఫోన్ నంబర్ల ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు.



విద్యార్థులు సమయపాలన పాటించాలి

విద్యార్థులు ఇంటర్ బోర్డు ఆదేశాలు తూచా తప్పకుండా సమయ పాలన పాటించాలి. పరీక్షలు ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు ఉంటాయి. నిమిషం ఆలస్యం నిబంధన అమలులో ఉంది. జిల్లాలో పరీక్షల నిర్వాహణ కోసం చీఫ్ సూప రిండెట్లు, డిపార్టుమెంటల్ అధికారులు, సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ అందా లను ఏర్పాటు చేశాం. జిల్లాలో పరీక్షలు సజావుగా, ప్రశాంత వాతా వర ణంలో నిర్వ హించడానికి తగు జాగ్రత్తలు తీసు కుంటున్నాం. జిల్లా కలెక్టర ఆదేశాలతో ఆర్టీసీ వారు ఆయా రూట్లలో విద్యార్థుల సమయానుకూలంగా బస్సులు ఏర్పాటు చేశారు. పరీక్షలు సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు కషి చేస్తున్నాం. పరీక్షలు రాస్తున్న ప్రతి విద్యార్థి సమయం కంటే ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. విద్యార్థులు ఒత్తిడికిలోను కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలి.

కె. దేవరాజన్ (ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి)

మహాదేవపూర్‌లో కోర్టులు ఏర్పాటు చేయాలి

హైకోర్టు జడ్జికి ఎంపీపీ రాణిబాయిరామారావు విజ్ఞప్తి

నవతెలంగాణ-మహదేవ్‌పూర్

మారుమూల అటవీ ఆదివాసీ ప్రాంతమైన మహాదేవపూర్‌లో సబ్ కోర్టు, మునిసిఫ్ కోర్టు ఏర్పాటు చేయాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఎన్ రాజేశ్వరరావుకు ఎంపీపీ బి రాణీబాయి రామారావు విజ్ఞప్తి చేశారు. శనివారం ఉదయం 9.30గంటలకు మహాదేవపూర్ పాత ఎంపీడీవో కార్యాలయంలో కోర్టు ఏర్పాటు కోసం హైకోర్టు న్యాయమూర్తి పరిశీలించారు. ఈ సంద్భంగా ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన హైకోర్టు న్యాయమూర్తి రాజేశ్వరరావును ఎంపీపీ రాణీబాయి రామారావు కలిసి శాలువాతో సన్మానించారు. స్వాతంత్ర్యానికి పూర్వం నిజాం సర్కారు హయాంలో మహాదేవపూర్‌లో కోర్టు, పోలీస్‌స్టేషన్, నీటిపారుదల శాఖ కార్యాలయం, పట్టు పరిశ్రమ కార్యాలయం ఉండేవని జడ్జికి విన్నవించారు. మహాదేవపూర్ పంచాయతీ సమితి నుంచి కాటారం, మహాముత్తరం, మలహర్, పలిమెల మండలాలు విడిపోయాయని తెలిపారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గడ్‌ల సరిహద్దుల్లోని ఆదివాసీ, గిరిజనులకు న్యాయ సేవలు అందించేందుకు మహాదేవపూర్‌లో కోర్టులు ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. సబ్ కోర్టు, మునిసిఫ్ కోర్టుల ఏర్పాటు కోసం అవసరమైన భవనాలను ఏర్పాటు చేస్తామని హైకోర్టు న్యాయమూర్తికి విజ్ఞప్తి చేశారు. కోర్టు ఏర్పాటు కోసం పాత ఎంపీడీవో కార్యాలయంతో పాటు మాడా కార్యాలయం, కలెక్టర్ క్యాంపు కార్యాలయం న్యాయశాఖకు కేటాయిస్తామని ఎంపీపీ బి.రాణీబాయి రామారావు హైకోర్టు న్యాయమూర్తికి విన్నవించారు. కార్యక్రమంలో భూపాలపల్లి, ములుగు జిల్లా జడ్జీలు, జూనియర్ జడ్జీలు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, మహదేవ్‌పూర్ సీఐ రాజేశ్వరావు, ఎస్సై ప్రసాద్, ఇన్‌చార్జీ తహసీల్దార్, ఐకేపీ ఏపీఎం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.





కోటగుళ్లలో ఎంపీడీవో పూజలు

నవతెలంగాణ-గణపురం

కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో నూతనంగా ఎంపీడీవో గా బాధ్యతలు చేపట్టిన భాస్కర్, అనసూర్య దంపతులు శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ అర్చకులు నరేష్ వారికి ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలను అందజేసి ఘనంగా సన్మానించారు.

శ్రీనుబాబు జన్మదిన వేడుకలు





నవతెలంగాణ-మహదేవ్‌పూర్

మండలంలోని అంబటిపల్లిలో మంత్రి శ్రీధర్‌బాబు సోదరుడు, శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ శ్రీనుబాబు 51 పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎర్రవెల్లి విలాస్ కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో దామరకుంట శ్రీకాంత్, పట్టి రాజబాబు, నారం రాంబాబు తిరుపతి రెడ్డి వసంతరావు సంతు సాయి రఫిక్ సాదిక్ కష్ణమూర్తి చందు అనిల్ సంజీవ్ సాయి శివ సురేష్ రాజు పాల్గొన్నారు.

పలిమెల మండలంలో శ్రీను బాబు జన్మదిన సందర్భంగా అంగన్వాడీ స్కూల్‌లో పిల్లలకు స్వీట్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దండెర రాజేందర్, గుండెబోయిన వెంకటస్వామి, జిల్లా కార్యదర్శి బడిష్ సారయ్య ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు తోలం శ్రీనివాస్, దాసరి రాజు, మోతే ఉమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాపల్లికోటలో శ్రీపాద ట్రస్ట్ చైర్మన్, యువనేత దుద్దిళ్ల శ్రీనుబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీనుబాబు చిత్ర పటానికి పంచామతాభిషేకం (తేనే, పాలు, నెయ్యి, నీరు, పెరుగుతో అభిషేకం) చేశారు. అనంతరం అనంతరం కేక్ కట్ చేసి, నిరుపేద కుటుంబాలకి దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు కాత్రేవుల నవీన్ యాదవ్, గ్రామ శాఖ అధ్యక్షులు కల్ల గట్టయ్య, కాంగ్రెస్ నాయకులు బొగ్గుల తిరుపతి, కాటవెని రాజయ్య, చంద్రయ్య, అట్టెం రాజు, ఐలయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహదేవ్‌పూర్ మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కట్కం అశోక్ ఆధ్వర్యంలో శ్రీను బాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, యువజన నాయకులు, మహిళా కాంగ్రెస్, ఎస్సీ సెల్, ఎస్టీ సెల్, మైనార్టీ సెల్, బీసీ సెల్,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలేశ్వరంలో శ్రీనుబాబు రోజు సందర్భంగా చేసిన ఎస్‌సీ సెల్ మండల అధ్యక్షులు లేతకారి రమ్య రాజబాబు దంపతులు హై స్కూల్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు.కార్యక్రమములో జిల్లా ప్రధాన కార్యదర్శి కామిడి శ్రీనివాస్‌రెడ్డి, గ్రామశాఖ ఉపాధ్యక్షులు తాజోద్దీన్, సీనియర్ నాయకులు హైదర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నిట్టూరి నగేష్, మైనార్టీ మండల నాయకులు ఫరీద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మతిన్‌ఖాన్ ఆధ్వర్యంలో శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిల్ల శ్రీనుబాబు పుట్టినరోజును సందర్భంగాకరీంనగర్ బస్టాండ్ వద్ద శ్రీపాద విగ్రహం ముందు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహదేవ్‌పూర్ విజయ్, పెండ్యాల శ్రీనివాసరావు, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు తాజుద్దీన్, పెద్దపల్లి మైనార్టీ అధ్యక్షుడు అక్బర్‌ఖాన్, రాములు, శ్రీనివాస్, అలిస్, నరేందర్, భూమేష్, వెంకన్న, నర్సింగ్‌రావు, సంతోష్, రామారావు పాల్గొన్నారు.

మహాముత్తారం : శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీను బాబు జన్మదిన సందర్భంగా మహా ముత్తారం మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాటోత్ వంశిరాజ్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, బీసీ సెల్ ఎస్సి సెల్ మైనారిటీ సెల్ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



మేడారం జాతర ముగిసింది...

ఇసుక జాతర మొదలు కానుంది?

నవతెలంగాణ-మల్హర్‌రావు

మేడారం జాతర నేపథ్యంలో ఇసుక లారీలు జాతర ముగిసే వరకు నిలిపి వేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ఫలితంగా మేడారం జాతర దష్ట్యా పది రోజుల పాటు మంథని నియోజకవర్గ పరిధిలో ఇసుక లోడింగ్ బంద్ అంటూ టీఎస్‌ఎండీసీ ప్రకటన చేసింది. జాతర ముగియడంతో నేటి నుండి మళ్లీ రోడ్లు ఇసుక లారీలు, ట్రాక్టర్ల జాతర కొనసాగనుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. మేడారం సమ్మక్క-సారక్క జాతర పుణ్యాన మంథని నియోజకవర్గ రోడ్లపై పది రోజుల పాటు ప్రశాంతత రాజ్యం ఏలింది. ఎప్పటికి ట్రాఫిక్‌తో బిజీగా ఉండే మంథని నియోజకవర్గంలో ఇసుక లారీలు,ట్రాక్టర్ల జాతరగా మారింది. ఓవైపు ఈ పది రోజుల పాటు కేవలం రోడ్ల మీద జాతరకు వెళ్లే బస్సులు, కార్లు, ఆటోలు తప్ప భారీ వాహనాలు ఎక్కడా కనిపించలేదు. ఏ ప్రమాదాలు జరుగలేదు.

పది రోజుల నుండి మంథని రోడ్లన్నీ బిజీ లేకుండా ఉండగా, బెరుకు లేని ప్రయాణం... బ్రేకులు లేని యువత బైకుల పయనం..."మేఘాలలో తేలిపొమ్మన్నది...తుఫానులా రేగి పొమ్మన్నది..."అంటూ ప్రయాణపు కలకు నేటితో తెర పడనుంది. నేటి నుండి మళ్లీ మంథని రోడ్లన్నీ గజిబిజిగా, ఇసుక లారీల రణగొన ధ్వనులు, ఓవర్ లోడ్ ల విన్యాసాలు, రోడ్డుపై ప్రయాణం చేయాలంటే బిక్కు బిక్కుమంటూ సాగాల్సిన దుస్థితి ఉంటుంది. ఏది ఏమైనా మంథని పల్లెల రోడ్లు ప్రశాంతంగా ఉండే రోజులు ఎప్పుడొస్తాయో...మానేరు, గోదావరి నదుల ఇసుక ఎప్పుడు అయిపోతుందో.. మాఫియాల రాజ్యానికి అంతం ఎప్పుడో అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.